కర్నూలు | నంద్యాల
వార్త
25 జనవరి 2026 ఆదివారం పేజీలు 4

# టెన్త్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత.. లక్ష్యం : జిల్లా కలెక్టర్

**కర్నూలు, జనవరి 24, ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పదవ తరగతి ఫలితాల మెరుగుదల లక్ష్యంగా రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, మెంటార్లుగా నియమితులైన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో 72 శాతం పురోగతి సాధించామని, దీనితో సంతృప్తి చెందకుండా మరింత కృషి చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో కర్నూలు జిల్లాను ముందువరుసలో నిలపాలన్న లక్ష్యంతో పనిచేయాలన్నారు. వలస వెళ్లిన విద్యార్థులను తిరిగి రప్పించి హాస్టళ్లలో చేర్పిస్తున్నామని, ఏ ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకూడదన్న సంకల్పంతో కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఎంఈవోలు, మెంటార్లుగా నియమితులైన అధికారులు వారానికి ఒకటి లేదా రెండు సార్లు పాఠశాలలను సందర్శించి సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బలహీన సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, షైనింగ్ స్టార్స్ సంఖ్య మరింత పెంచాలని సూచించారు. విద్యార్థి ఏ సబ్జెక్టులో బలహీనంగా ఉంటే ఆ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. స్లిప్ టెస్టుల మార్కులను ప్రతిరోజూ విశ్లేషించి, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై మరుసటి రోజు సంబంధిత ఉపాధ్యాయులతో చర్చలు జరిపి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.




పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతతో,ఉండాలని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మిడ్‌డే మిల్స్ స్టీరింగ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో, పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన పెరిగేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఈఓ సుధాకర్, సర్వశిక్ష అభియాన్ పీఓ డాక్టర్ లోక్ రాజ్, ఇంటర్మీడియట్ ఆర్ఐఓ లాలప్ప, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోని జిల్లా కోసం.. బంద్..!

- లారీల మధ్య సంపూర్ణం
- స్వచ్ఛందంగా మూతపడ్డ దుకాణాలు
- పోలీసుల వలయంలో ఆర్టీసీ డిపో
- డిపో ముందు నిరసన చేసిన జే ఏ సి నాయకులు







**ఆదోని క్రైమ్ జనవరి 24 ప్రభాతవార్త :** పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గాలను కలిపి ఆదోని జిల్లా చేయాలన్న ఉద్యమం రోజురోజుకి తీవ్రతరం అవుతుంది. ఆదోని జిల్లా సాధన జేఏసీ పిలుపుతో శనివారం బంద్ విజయవంతం అయింది. ఉదయం 5 గంటలకే జేఏసీ నాయకులతోపాటు బీజేపీ జనసేన, వైసిపి, సిపిఐ ,సిపిఐ (ఎంఎల్), వామపక్ష విద్యార్థి సంఘల నాయకులు ఆర్టీసీ డిపో వద్దకు చేరుకొని బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. అక్కడే బైఠాయించారు. స్వచ్ఛందంగా ప్రజలు దుకాణాలు, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు బ్యాంకులు, బంగారు దుకాణాలు మూతపడ్డాయి. కర్నూలు, అనంతపురం, సిరుగుప్ప, బళ్లారి, రాయచూరు వంటి నలు దిక్కుల నుంచి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ముందుగానే జేఏసీ ఆదోని ఆలూరు...

• వివరాలు 2లో

# యువతా.. మేలుకో..!

- ఓటు..ప్రజాస్వామ్య మార్పుకు తొలిమెట్టు..
- ఓటుకు నోటుపై అవగాహన అవసరం..
- ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకం..
- నేడు జాతీయ ఓటర్లు దినోత్సవం..



**ఓటు అంటే ఏమిటీ.. దాని వల్ల కలిగే ప్రయోజనం ఏమిటీ.. అనే విషయాల పట్ల ఖచ్చితంగా అవగాహన ప్రతి ఒక్కరికి అవసరం.. రాజకీయ పార్టీలు వారి వారి ఆధిపత్యం, అధికారం కోసం ప్రజలను నోటుతో మభ్యపెట్టే ప్రయత్నం చేయడం జరుగుతుంది.. ఇటువంటి చర్యలకు స్వస్థి పలకాలంటే ఖచ్చితంగా అవగాహన అవసరమున్నది.. ఇందులో ముఖ్యంగా పార్టీలు, అవి చేస్తున్న కార్యక్రమాలు, వారిచ్చే హామీలు అనే అంశాలపై గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా చేయాలి.. ఎన్నికల సమయంలో పార్టీలు, నాయకులు ఇచ్చే హామీలను నమ్మడానికి, వారి చెప్పేది అర్థం చేసుకోవడానికి అక్షరాస్యత కూడా అవసరం..తద్వారా మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు అవకాశం ఉంది..ఒకవేళ ఆ నాయకుడు చెప్పిన హామీలను నెరవేర్చక పోతే అతనిని నిలదీసేందుకు కూడా వెనకాడకుండా ఉండాలి..అటువంటి ప్రజా చైతన్యం ఇప్పుడు అవసరం..**

2లో

**కోసిగి, జనవరి 24, ప్రభాతవార్త** ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు చాలా ముఖ్యమైంది.. ప్రజల సమస్యల పరిష్కా రానికి కృషి చేసేందుకు మంచి నాయకుడిని ఎన్నుకునే పాశుపతాస్రా ్ం.. అటువంటి ఓటరు నాడీని పసికట్టి డబ్బుతో ఓటు కొనుకునే పరిస్థితికి స్వస్థి పలికాలి.. అందరు ఓటర్లు చైతన్యవంతమైనప్పుడు ఇటువంటి పరిస్థితిలకు తావుండదు.. మొదట ఓటరు కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేయాలన్న నిబంధనపై సుప్రీం కోర్టు తప్పని సరికాదని తీర్పు నివ్వడంతో అది కాస్తా ఆగిపోయింది. నకిలీ ఓటర్లలను గుర్తించేందుకు బిఎల్ఓలే ఇప్పుడు కీలకంగా మారనున్నారు. ఓటు విలువ, దాని ప్రాధాన్యత గుర్తించి ఇంకా సమాజంలో యువతీ, యువకులు తెలుసుకుని ప్రజలకు చైతన్యవంతం చేయాల్సిన పరిస్థితి ఉంది..

**యువతా మేలుకో:** ఓటు హక్కును నమోదు చేయించుకోవడంలో యువత నిర్లక్ష్యంగా కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది..మంత్రాలయం నియోజకవర్గంలో 18-21 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువత ఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సి ఉందని రెవిన్యూ అధికారులు గుర్తించారు..ఇందుకు గానూ ఓటర్ల ప్రక్రియ జూలై నెలలో మొదలైతే ఇప్పటికీ కేవలం 12,021 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు.. నియోజక వర్గంలో కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం, కౌతాళం మండలాలు ఉన్నాయి. ఆయా మండలాలల్లో ఇప్పటి వరకు 1,74,653 మంది ఓటర్లు నమోదు కాగా వారిలో పురుషుల ఓటర్లు 85,963 మంది, స్త్రీల ఓటర్లు 88,677 మందిగా నమోదైంది..18-21 ఏళ్ల మధ్య ఉన్న వారిని గుర్తించిన ఓటర్లలో ఇంకా సుమారు 8 వేల మంది ఓటు హక్కులను నమోదు చేయించుకోవాల్సి ఉన్నట్లు సమాచారం..

**236 పోలింగ్ కేంద్రల్లో నమోదు:** మంత్రాలయం నియోజకవర్గంలోని 236 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి కేంద్రానికి ఒక్కొక్క బిఎల్‌వో చొప్పున ఓట్లను నమోదు చేసుకుంటారు, ఇందులో ప్రతి రోజూ బిఎల్ఓలు చేర్పులకు ఫారం-6, తొలగింపు లకు ఫారం-7, సవరణలకు ఫారం-8ల ద్వారా ఓట్లు చేర్పులు, తొలగింపుల, సవరణల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు..



# తండ్రికి తగ్గ.. తనయుడు..!

: నాలుగు సార్లు మంత్రిగా ఎం.ఎం.డి.ఫరూక్..
: మూడుసార్లు తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్.ఎం.డి.ఫిరోజ్.
: ఆప్యాయత,చిరునవ్వుతో కార్యకర్తల మనసు గెలుచుకున్న ఫిరోజ్

**నంద్యాల జనవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర రాజకీయాల్లో పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీని నమ్ముకొని వరుస మంత్రి పదవులు దక్కడం రాజకీయాల్లో అరదు.పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీని నమ్ము కున్న ఒకే ఒక్క నాయకుడు ఎన్. ఎం.డి.ఫరూక్.సినీ నటుడు నందమూరి తారక రామారావు రాజకీయాల్లో పెను మార్పులు సృష్టించాలని,పేద ప్రజలకు న్యాయం చేయాలని రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.రాజకీయాల్లో 1983 లో తెలుగుదేశం పార్టీని స్థాపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నసమయంలో తెలుగుదేశం పార్టీ పోటీలో నిలిచింది.రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించింది.ప్రపంచ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ గురించి చర్చించుకున్నారు.అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లో పేదల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ఎన్నికల్లో ఊహించని అదృష్టం ఫరూక్ కు దక్కింది.చిన్న తనం నుంచే ఎన్టీఆర్ అభిమాని కావడం,ఫరూక్ రాజకీయాల్లోకి రావడంతో ఎన్టీఆర్ నుంచి పిలుపు రావడం నంద్యాల ఎమ్మెల్యే గా పోటీ లో నిలబడాలి అని చెప్పడం క్షణాల్లో జరిగిపోయింది.ఆ ఎన్నికల్లో మొదటి సరిగా ఫరూక్ నంద్యాల ఎమ్మెల్యే గా అయ్యారు.నటి నుంచి నేటి వరకు అధినాయకుల అడుగుజాడల్లో నడుచుకుంటూ వినయ విధేయుడుగా నడుచుకుంటూ ఎన్టీఆర్,నారా చంద్ర బాబు హయాములో నాలుగు సార్లు ఎమ్మెల్యే గా గెలుపొంది నాలుగు సార్లు మంత్రి పదవులు పొందారు.అధికారంలో లేని సమయంలో సైతం పదవులు వరించాయి.పదవులు లేని సమయంలో సైతం కార్యకర్తలకు అండగా నిలవడం ప్రేమగా పలకరింపులు ఆయనకు శ్రీరామ రక్షగా మారింది.ఆయనకు అయిదు మంది కుమారుల్లో ఇద్దరు ఫిరోజ్,ఫయాజ్ లు రాజకీయంగా ఇంట్రెస్ట్ చూపించడంతో తండ్రి తో పాటు తిరుగుతూ రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు. తండ్రి వెంట తిరుగుతూ నిశితంగా పరిశీలిస్తూ అధికారులు, నాయకులు,కార్యకర్తలు,ప్రజలతో ఎలా మాట్లాడాలి,విమర్శలు చేస్తే ఎలా మాట్లాడాలి అని తెలుసుకున్నారు. పార్టీలో అందరితో కలుపుకుంటూ ఆప్యాయత, చిరునవ్వుతో అందరిని కలుపుకొని పోవడంతో తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం వచ్చింది.బాధ్యత పెరగడం తో పార్టీ కోసం సైనికుడిలా పనిచేశారు.2024 ఎన్నికల్లో తండ్రికి మరోసారి టికెట్టు లభించడంతో తనయులు ఫిరోజ్,ఫయాజ్ లు పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో యువత,కార్య కర్తలతో సుడిగాలి పర్యటనలు చేసి తండ్రి విజయంలో ప్రార్థన పాత్ర పోషించారు.నాలుగు సార్లు తండ్రి మంత్రి అయినా ఏ రోజు గర్వంగా ఎవరితో మాట్లాడకుండా అందరినీ కలుపుకొని పోతూ వివాదా రహితుడిగా పేరు తెచ్చుకున్నారు.పార్టీ కి చేస్తున్న సేవలకు అప్పటికే రెండు సార్లు ఆ పదవి దక్కడం,మరో సారి తాజాగా తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడం జరిగింది.ఆదివారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఫిరోజ్ తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన కోసం రానున్నారు.ఫిరోజ్ బాయ్ అని అందరూ పిలుచుకునే ఆయనను మరిన్ని మంచి పదవులు రావాలని కార్యకర్తలు ఆశిస్తున్నారు.

# సమన్వయంతో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**– జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్**

**నంద్యాల, జనవరి 24, ప్రభాతవార్త ప్రతినిధిః** ఇతర ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయం చేసుకూంటూ గణతంత్ర దినోత ్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు అదేశించారు. శనివారం పట ్టణంలోని గవర్నమెంటు డిగ్రీ కళాశాల గ్రౌండ్ నందు గణతంత్ర వేడుకల నిర్వహణలో భాగంగా పోలీస్ కవాతును జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తు



పోలీస్ కవాతును రిహార్సల్ ్స నిర్వహించారు. ముందుగా పెరేడ్ కమాండర్ జిల్లా ఎస్పీకి గౌరవ వందనం సమర్పించి కవాతు పరిశీలన కొరకు ఆహ్వానించగా ఎస్పీ పరేడ్ కవాతు పరిశీలన వాహనంలో పర్యటించి కవాతులో ఉన్న బలగాలను పరిశీలించారు. ఈవేడుక లకు ముఖ్య అతిథులు, పాఠశాల విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. అద్యంతం సాగిన ఈ కవాతు రిహార్సల్స్‌లో పోలీస్ అధికారులు, ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు, హోంగార్డ్స్, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, స్కౌట్ విద్యార్థులు, పోలీస్ బ్యాండ్ వారి ప్రదర్శన కన్నుల పండుగగా ఉందని సోమవారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించు కవాతు ఇంకా అద్భుతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ కొన్ని సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం జావళి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు బాబు, మంజునాథ్, సురేష్

# ఏసీబీ వలలో.. వీఆర్వో లాలప్ప..!

**: మూడు నెలల్లోనే ముగ్గురిని బుక్ చేసిన ఏసీబీ అధికారులు**

**డోన్ రూరల్ జనవరి 24 ప్రభాతవార్త :** డోన్ మండల పరిధిలోని ఉడుములపాడు జగదృత్తి గ్రామానికి చెందిన వీఆర్వో లాలప్ప 25 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పి సోమన్న ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వీఆర్వో ని అదుపులోకి తీసుకున్నారు వివరాలకు వెళితే వెల్దుర్తి గ్రామానికి చెందిన నాగేంద్ర తో 25 వేల రూపాయలు లంచం అడిగిన విషయం ఏసీబీ అధికారులతో రైతు నాగేంద్ర విన్నవించుకోగా అధికారులు గత వారం రోజుల నుండి కాపు కాశి శనివారం రైతు ద్వారా 25000 రూపాయలను పట్టణంల్లోని హెయిర్ స్టైల్ షాప్ లో



తీసుకుంటుండగా అధికారులు డైరెక్ట్ గా పట్టుకున్నారు ఏసీ బి అధికారులు పాల్గొన్నారు

# బాధ్యతాయుత డ్రైవింగ్‌తోనే ప్రమాదాల నివారణ

**: ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రాణ రక్షణ సాధ్యం - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**కర్నూలు, హాస్పిటల్ జనవరి 24 ప్రభాతవార్త :** ఈరోజు జి జి హెచ్ లెక్చరర్స్ గ్యాలరీలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఏ సిరి మాట్లాడుత డ్రైవింగ్ సమయంలో బాధ్యతగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గత ఏడాది కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో 330 మంది మృతి చెందగా, 719 మంది గాయపడ్డారని తెలిపారు. మరణించిన వారిలో 18 నుంచి 40 సంవత్సరాల యువకులే అధికమని పేర్కొన్నారు. అతివేగం, మత్తులో వాహనం నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ధరించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ప్రతి ఒక్కరూ గమ్యస్థానానికి కొంత ముందుగానే బయలుదేరాలని సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంట అయిన గోల్డెన్ అవర్‌లో బాధితులను ఆసుపత్రికి చేర్చితే ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. గుడ్ సమారిటన్ పథకం కింద సహాయం చేసిన వారికి రూ.25,000 నగదు ప్రోత్సాహకం అందజేస్తారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ డ్రైవర్లు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వాడాలని ఆదేశించారు.

# డాక్టర్‌పై దాడి చేసి.. ఇంజక్షన్ చేసిన.. నలుగురు నిందితుల అరెస్ట్

**: 3 టౌన్ పోలీసు సిబ్బందిని అభినందించిన డి.ఎస్.పి**

**కర్నూలు హాస్పిటల్ జనవరి 24 ప్రభాతవార్త :** కర్నూలు 3 టౌన్ పోలీసులు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. తేదీ ఈనెల 9వ తారీకు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో డా. కె. శ్రావణి ( కేఎంసి అసిస్టెంట్ ప్రొఫెసర్) డ్యూటీ అనంతరం తన స్కూటీపై ఇంటికి వెళ్తుండగా వినాయక ఘాట్ సమీపంలో నిందితులు వెనక నుంచి ఢీకొట్టి కింద పడేశారు. అనంతరం నలుగురు కలిసి మోసపూరితంగా సహాయం చేస్తున్నట్లు నటించి ఆమెకు హెచ్ఐవీ ఇంజక్షన్ చేశారు. ఈ ఘటనపై బాధితురాలి భర్త డా. ఎస్ ఎల్ ఆర్ కరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డి ఐ జి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు, డి.ఎస్.పి జే. బాబు ప్రసాద్ పర్యవేక్షణలో, ఇన్స్పెక్టర్ పి శేషయ్య నాయకత్వంలో సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు బీచుపల్లి బోయ వసుందర వేదవతి కొంగే జ్యోతి బూమా జశ్వంత్ బూమా .శ్రుతి జాను లను 24న అరెస్ట్ చేసి, రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ కేసు విచారణలో ప్రతిభ చూపిన ఇన్స్పెక్టర్ పి. శేషయ్య, ఎస్సై బాల నరసింహులు, ఉమెన్ ఎస్సై ఆశలతతో పాటు సిబ్బందిని డి ఎస్ పి అభినందించారు.



# 28నుండి నంద్యాల జిల్లాలో బిజేపి కీలక సమావేశాలు

**నంద్యాల, జనవరి 24,ప్రభాతవార్త ప్రతినిధి :** ఈనెల 28వ తేదిన నంద్యాల జిల్లాలో బిజేపి పార్టి కీలక సమావేషాలు నిర్వహిస్తుందిన అ పార్టి జిల్లా అద్యక్షులు అబిరుచిమధు చెప్పారు. శనివారము అయన ప్రబాతవార్తప్రతినిధితో పోన్‌లో మాట్లాడుతూ బిజేసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి జెనలన ఇంచార్జి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి రాయలసీమ పర్యటనలో బాగంగా ఈ నెల 28వ తేదిన ఉదయంయ 10గంటలకు అళ్లగడ్డ అసెంబ్లీలో పర్యటించనున్నారు అదే రోజు మద్యహ్నాము 2.30గంటలకు నంద్యాల అసెంబ్లీ నియోజక లో పర్యటించనున్నారని చెప్పారు. 29వ తేదిన ఉదయం 10.30కి బనగానపల్లెఅసెంబ్లీలో అదే రోజు మద్యహ్నాము 2.30కి డోన్ అసెంబ్లీలో పర్యటించి సమావేషాల్లో పాల్గొంటారని చెప్పారు. 30వ తేది ఉదయంయ 10.30కి నందికోట్కూరు అదే



రోజు 2.30కి శ్రీశైలం నియోజక వర్గంలో పర్యటించనున్నారు ఈసమావేషాలకు అయా అసెంబ్లీ నియోజక వర్గాల పరిదిలోని అన్ని మండలాల అద్యక్షులు మండల కమిటి సభ్యులు వందవాతము హాజరు కావాలని మదు కోరారు. అలాగే క్రియాశీలక సభ్యులు సీనియర్ నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సమావేశాలకు హాజరు అయ్యే ప్రతి కార్యకర్త పార్టి కండువ దరించి రావాలన్నారు.

# భగవద్గీత నేటి యువతకు మార్గదర్శనం

**కర్నూలు సీటీ జనవరి 24 ప్రభాతవార్త :** మారుతున్న ప్రపంచంలో నేటి యువతకు భగవద్గీత మార్గదర్శనంగా నిలుస్తుందని శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు.శనివారం కల్లూరు లోని కెఎస్ఆర్ కళ్యాణమండపం నందు సూర్యనారాయణ స్వామి ఆలయం ఏడవ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక భగవద్గీత పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామీజీ పెద్దలు తమ పిల్లలకు చిన్నప్పటినుండే భగవద్గీత అభ్యసించడానికి నేర్పించాలన్నారు.శ్రీ సూర్యనారాయణ స్వామి టెంపుల్ చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రథసప్తమైన పురస్కరించుకొని 25వ తేదీన సామూహిక సూర్య నమస్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



# స్మశానం కబ్జాపై దళితుల ఆందోళన..

: దళితులు చనిపోతే ఎక్కడ పూడ్చాలి అంటూ నినాదాలు.. : దళితుల స్మశాన భూమిని చదును చేసి ప్లాట్లుకు యత్నం.. : తహశీల్దార్, పోలీసు కార్యాలయాల ముందు నిరసన..బైటాయింపు..



**కోసిగి, జనవరి 24, ప్రభాతవార్త :** దళితులు చనిపోతే పూడ్చేచోటును కొందరు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు సిద్దం కావడంతో తెలుసుకున్న సిద్దప్పపాలెం దళితులు ఆందోళనకు దిగారు..శనివారం దళితులు, దుర్గానగర్ కాలనీ వాసులు స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి దళితుల స్మశాన భూమి కబ్జాపై నిరసన చేపట్టారు.. సిద్దప్పపాలెం, దుర్గానగర్ కాలనీ వాసులైన చంద్రప్ప, పెద్దఈరన్న, ఉరుకుందప్ప, ఎలకన్న, కొల్లినాగరాజు, చిన్నన్నల ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. శవాలు ఎక్కడపూడ్చాలి మీరైనా చెప్పండి అంటూ అధికారులను నిలదీసారు.. మగ, ఆడ, యువకులు ఏకమై ఒక్కసారిగా ధర్నాకు పిలుపు ఇచ్చారు.. ఈ సందర్భంగా దళిత పెద్దలైన వారు మాట్లాడుతూ కోసిగి గ్రామ శివారులోని సజ్జలగుడ్డం రోడ్డు నందు దళితులకు సంబందించిన స్మశాన వాటిక ఉందని, తాము తమ బంధువులు మృతి చెందితే ఇక్కడనే పూడ్చుకుంటున్నామన్నారు.. అయితే ఈ స్మశాన వాటిక పక్కనే స్థలం ఉన్న వ్యక్తి తన స్థలాన్ని ముకుంద నర్సారెడ్డి అనే వ్యక్తికి విక్రయించడం జరిగిందని, అయితే ఈ ముకుంద నర్సారెడ్డి, దొడ్డిదేవన్న ఈరన్నలు కొనుగోలు చేసిన తమ స్థలంతో పాటు దళిత స్మశాన వాటికను కూడా కబ్జా చేసారని, ఇందు కోసం స్మశాన భూమిని చదును చేసేందుకు గరుసును, మట్టిని తెప్పించడం జరిగిందన్నారు.. ఈ దళిత స్మశాన భూమిలో ప్లాట్లువేసి విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు.. ఈ మధ్య కాలంలో తమ బంధువులైన దళితులు మృతి చెందితే దళిత స్మశాన వాటికలో పూడ్చుడానికి వెళ్లితే తమను అడ్డగిస్తున్నారని ఈ ప్రాంతంలో అంత్యక్రియలు చేసుకోరాదని తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.. ఎప్పటి మాదిరిగానే తమకు స్మశాన వాటికలో శవాలు పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.. అనంతరం ఆర్ఐ శ్రీరాములుకు వినతి పత్రం అందించి స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఎస్ఐ రమేష్‌రెడ్డికి కూడా వినతి పత్రం అందించి తమకు న్యాయం చేయాలని వేడుకునా ్నరు.. ఈ సందర్భంగా ఎస్ఐ రమేఏష్‌రెడ్డి, ఆర్ఐ శ్రీరాములు దళితుల పెద్దలతో మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో ఈ సమస్యను పరిష్కారిస్తామని తెలిపారు.. దీంతో వారు ఆందోళన విరమించుకున్నారు.. ఈ కార్యక్రమంలో మల్లయ్య, కోడి ఉరుకుందప్ప, చిన్న నరసయ్య, చిదానంద, అడ్వకేట్ నాగరాజు, సన్నక్కి నరసింహులు, ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్, ఎంఆర్‌పిఎస్ నాయకులు సామేల్, ఎఐవైఎఫ్ నాయకులు రాజు, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఈరేష్, కాలనీ స్త్రీలు, పెద్దలు, పురుషులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడడం వలన మానవ మనుగడకే ప్రమాదం

– ఎమ్మెల్యే – కె.సి.కెనాల్ తప్పని సరిగా నీటిని వదులుతాం



**నందికొట్కూరు, జనవరి 24, ప్రభాతవార్త :** ప్లాస్టిక్ వాడడం వలన మానవ మనుగడకే ప్రమాదకరంగా మారుతుందని నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం మండల పరిధిలోన బిజినవేముల గ్రామంలో స్వచ్ఛ రథం వాహానాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ రవి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శనివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణా..ఆంధ్ర ..స్వచ్ఛ ఆంధ్ర.కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు,నీటి పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో శ్మశాన వాటికల సమస్య పరిష్కారించేందుకు స్థలాలు గగురిత్తించమని అధికారులకు సూచించామని తెలిపారు. గ్రామంలోని ప్రజలు తబమ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని, దీంతో దోమలను నివారించ వచ్చునని, ఇకపై ప్రజలు పాతసామాన్లు, ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మీ వద్ద స్వచచ్ఛ రథం వస్తుందని, మీరు వేసిన సామానుకు తగ్గట్టు మీకు వస్తువులు ఇవ్వడం జరుగుతుంన్నారు. కె.సి.కెనాల్ కింది రైతాంగం ఎటువంటి ఆంధోళన చెందవద్దని, నీటి సమస్యను సి.ఎం.దృష్టికి తీసుకెళ్ళామని త్వరలోనే నీటిని వలడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సుబ్రమణ్యంశర్మ, మండల టిడిపి కన్వీనర్ మాంద్ర సురేంద్రనాథ్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎస్.ముర్తుజావలి, మండల ఏవో పి.షేక్షావలి, డిప్యూటి ఎంపిడిఓ రంగనాయక్ , సచివాలయ సిబ్బంది స్తానికులు పాల్గొన్నారు.

## వేడుకలను జాగ్రత్తగా జరుపుకోవాలి



**అవుకు, జనవరి 24, ప్రభాతవార్త :** రథసప్తమి వేడుకలను జాగ్రత్తగా జరుపుకోవాలని బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి సూచించారు. అవుకు మండలంలోని శివవరం గ్రామంలో వెలసిన అతి పురాతన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలకు కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి, అవుకు ఎస్సై అశోక్ గ్రామాన్ని సందర్శించి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేడు నిర్వహించబోయే రథసప్తమి వేడుకల్లో ఎలాంటి పవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఏట నిర్వహించ బోయే వేడుకలకి పలు మండలాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశామని తెలిపారు. వేడుకల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా భక్తులు సహకరించాలని కోరారు.

## బాలిక విద్యతోనే దేశాభివృద్ధి



**డోన్ రూరల్, జనవరి 24, ప్రభాతవార్త :** బాలికలు విద్యుత్ తోనే దేశాభివృద్ధి చెందుతుందని డోన్ రూరల్ ఎస్సై మమత అన్నారు శనివారం సాయి శ్రీ జూనియర్ కళాశాల యందు జాతీయ బాలిక దినోత్సవ కార్య క్రమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు జి.రామ్మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై మమత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళ సాధికారత మాటల్లో కాక చేతల్లో చూపించాల్సిన అవసరం ఉందన్నారు ప్రభుత్వం బాలికల కోసం అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని చేసుకోవాలని సూచించారు బాలికలు విద్యాభ్యాసంలో తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు పోతే వారు అనుకున్న గోల్స్ సాధిస్తారని పేర్కొన్నారు మహిళలకు తమ తమ హక్కులను సాధించుకోవడానికి కూడా కృషి చేయాలి అన్నారు బాలికలు చదువుకున్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు అనంతరం ఎదిగే ఆడపిల్ల అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జన విజ్ఞాన రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యం శెట్టి కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ మాబు లెక్చరర్లు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్త, ఆయాల పోష్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఆలూరు, జనవరి 24, ప్రభాతవార్త:** పత్తికొండ డివిజన్‌లో ఆలూరు మండలం హుళేబీడు 1వ కేంద్రంలో కార్యకర్త 1(ఈడబ్ల్యూఎస్), హొత్తిబెళగల్ 1వ కేంద్రంలో ఆయా 1(ఈడబ్ల్యూఎస్), చిప్పగిరి మండలంలో ఖాజీపురంకొట్టాల 1 (ఎస్సీ, ఆదోని డివిజన్‌లో అంగన్వాడీ కార్యకర్త 2 పోష్టులు నెరణికి కేంద్రం 2లో(బీసీ..బి) కొత్తపేట 1(ఓసి) కేటా యించబడ్డాయని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రాజెక్టు అధికారిణి బాల నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యకర్త పోష్టుకు తప్పని సరిగా 10వ తరగతి ఉత్తీర్ణులు కావాలని, అభ్యర్థినీలు 01.07.2025 నాటికి 21 సంవత్సరం నిండి 35 ఏళ్ళ లోపు ఉండాలని, అభ్యర్థిని తప్పని సరిగా వివాహితురాలై ఉండాలని, ఎస్సీ. ఎస్టీ జనసమూహాం లేని చోట ఇతరులను పరిగణంలోకి తీసుకుంటామని తెలిపారు. ఆయా పోష్టులకు తప్పని సరిగా ఏడవ తరగతి ఉత్తీర్ణులు కావాలని, లేనిచో అక్కడ పైచదువుల వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. జతపరిచిన ధృవ పత్రములు(అప్లికేషన్) 03.02.26 సాయంత్రం 5 గంటలలోపల స్తానిక సిడిపిఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

## మెగా జాబ్ మేళాలో 384 మందికి ఉద్యోగవకాశాలు



**నందికొట్కూరు, జనవరి 24, ప్రభాతవార్త :** పట్టణంలోని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలలో 384 మందికి ఉద్యోగ అవకాశాలు పొందినట్లుగా నిర్వాహాకులు తెలిపారు. శనివారం ఏపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు డి.ఆర్.డి.ఏ.ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 22 ప్రముఖ బహులజాతి సంస్థలు 1930 ఉద్యోగాల కోసం ఈ జాబ్ మేళా నిర్వహించగా 570 మంది అభ్యర్థులు హాజరయ్యారు కాగా వారిలో 384 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగవకాశాలు పొందినట్లు జిల్లా స్కిల్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, డి.ఆర్.డిఏ.ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కళాశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ వి.ఎన్.సత్యనారాయణ, డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, సరళాదేవి, స్రవంతి, శ్రీనాథ్, ప్రిన్సిపాల్ జి.ఎం.మన్సూర్ అహ్మద్, ప్లేస్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## 26న మాంసపు విక్రయాలు నిషేధం

**కర్నూలు మున్సిపల్, జనవరి 24, ప్రభాతవార్త:** నగరంలో ఈనెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మాంసపు విక్రయాలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు కమిషనర్ పి విశ్వనాద్ వెల్లడించారు. హోటల్స్, రస్టారెంట్‌లు, మాంసపు దుకాణాలు, తాత్కాలిక విక్రయ కేంద్రాల్లో మాంసపు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవం దేశ గౌరవానికి సబంధించిన ముఖ్యమైన రోజు కావడంతో ప్రజలంతా సహకరించాలని నిషేధిత ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. సోమవారం ఎలాంటి మాంసపు విక్రయాలు జరగరాదని స్పష్టం చేశారు.

## కారు బైకు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



**రుద్రవరం, జనవరి 24, ప్రభాతవార్త:** మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కారు బైకు ఎదురెదురుగా ఢీకొని ఒకిరికి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్థుల వివరాల మేరకు శనివారం కర్నాటకకు చెందిన కారు ఆళ్లగడ్డ నుండి అహోబిలం వైపు వస్తుండగా నరస్సా పురం నుంచి ముత్తులూరుకు బైక్‌పై వస్తున్న శ్రీను అనే వ్యక్తిని ఢీకొట్టడంతో అతనికి తీవ్రగాయాలు అయ్యాయన్నారు. దీంతో వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు.

## ఆదోని జిల్లా సాధనకై చేపట్టిన బంద్ విజయవంతం



**ఆదోనిటౌన్, జనవరి 24, ప్రభాతవార్త;** ఐదు నియోజకవర్గాలైన మంత్రాలయం, ఆలూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగ నూరు ప్రాంతాలను కలిపి ఆదోనిని జిల్లా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జేఏసీ నాయకులు, వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమయ్యింది. ఆదోని వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదోని జిల్లా కావాలని జేఏసీ బంద్ పిలుపునిచ్చిన సందర్భంగా వైఎస్సార్సీపీ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. దాదాపు 1000 మందికి పైగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొన్నారు. పట్టణంలోని షరాఫ్ బజార్, ఆర్ట్స్ కాలేజ్ రోడ్లలో బైకు ర్యాలీగా వెళ్లి బంద్‌ను విజయవంతం పూర్తి చేశారు. భీమాస్, శ్రీనివాస్ భవన్, మెయిన్ రోడ్డులో పాదయాత్రలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదోని వైఎస్సార్సీపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చంద్రకాంత్‌రెడ్డి, ఆదోని వైఎస్సార్సీపీ పట్టణాధ్యక్షులు బి.దేవాలు మాట్లాడుతూ ఆదోని జిల్లా కావాలని బంద్ చేపట్టడం జరిగిందన్నారు. ఆదోని ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష ఆదోని జిల్లా కావడమేనని చెప్పారు. పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో నిత్యం కరువు కాటకాలతో రైతులు, ప్రజలు అల్లాడి పోతున్నారన్నారు. ఆదోని ప్రాంతాన్ని జిల్లాగా చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆదోని జిల్లా సాధనకై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, టౌన్ ప్రధాన కార్యదర్శి తాయన్న, ఉప్పరి నారి ప్రధాన కార్యదర్శి నాగరాజు, అంబేద్కర్ నగర్ రామకృష్ణ, ఆర్టీసీ కాలనీ కౌన్సిలర్ చలపతి, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏసోబు, ప్రచార అధ్యక్షులు పరిగెల నారాయణ, ఆర్కే రామకృష్ణ, మల్లి, ఆర్వీ బాబు, సిద్ద, శివ, ఇర్ఫాన్‌బాషా, కౌన్సిలర్ అశోక్, చిన్నబంగారి, చిన్న వీరన్న, చిన్న వీరప్ప, ఆరేకల్ అనుమేష్, ఆరేకల్ నాగరాజు, కౌన్సిలర్ ఇక్బాల్, గంగన్న, పూర్ణ, వెంకీ, సైఫుల్లా, శ్రీలక్ష్మి, శోభలత, జులేకాబి, ఉస్మాన్‌బాషా, టైర్ అసోసియేషన్ సంఘం నాయులు ఆయుబు, చాంద్‌బాషా, ఖలీల్‌బాసా, కుప్పయ్య, భవాని ప్రసాద్, ఎల్లప్ప, ప్రసాద్, తారానాథ్, వీరేష్ పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించి ప్రగతికి తోడ్పడండి

**కర్నూలు మున్సిపల్, జనవరి 24, ప్రభాతవార్త :** నగరంలోని మొండి బకాయిదారులు తమ పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ కోరారు. పన్నుల వసూళ్ళలో నిర్లక్ష్యం వహించేవారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శనివారం యూకాన్ షాపింగ్ సముదాయంలో చీట్స్ ఫండ్స్‌కు సంబంధించి రూ.3.89 లక్షల పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో సంబంధిత సముదాయాన్ని సీజ్‌చేసినట్లు తెలిపారు. బళ్లారి చౌరస్తాలోని ఒక రేడియం షాపును కూడ బకాయిల కారణంగా క్లోజ్‌చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఏ జడ్ ఫంక్షన్ హాల్, అపోలో టైర్స్, రేడియం షాపులను సీజ్‌చేసేందుకు అధికారులు వెళ్లగా వారు వెంటనే పెండింగ్ పన్నులు చెల్లించారు. పన్నుల వసూళ్ల విషయంలో ఎలాంటి సడలింపులు ఉండవని బకాయిలున్నవారు తక్షణమే చెల్లించాలన్నారు. డిప్యూటి కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు రాజు, బార్గవ్, తిప్పన్న శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## బెలుంలో టీడీపీ నాయకుడు మృతి



**కొలిమిగుండ్ల, జనవరి 24, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని బెలుం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు టపాలు వుశేన్ అనారోగ్యంతో గత రాత్రి మృతిచెందారు. ఈయన గత కొద్దికాలం నుండి రాజకీయాల్లోకి వచ్చి గ్రామంలో మంచిపేరు ప్రతిష్టలు పొంది ఎదిగిన నాయకుడిగా పలువురు కొనియాడారు. ఈయన మృతి పార్టీకి తీరని లోటని ఈయన మృతికి రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సోదరుడు రామనాథ్‌రెడ్డి బెలుం గ్రామానికి వచ్చిన ఆయన మృతదేహనికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈయన వెంట అవుకుటీడీపీ నాయకులు ఉగ్రసేనారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ కుష్టువ్యాధి దినోత్సవం




**కర్నూలు విద్య, జనవరి 24, ప్రభాతవార్త:** నగరంలోని మైపర్ ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కుష్టువ్యాధి దినోత్సవం నిర్వహించారు. "కుష్టు పూర్తిగా నయం అవుతుంది – అసలు సమస్య అపవాదమే" అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా కుష్టు వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రారంభదశలో గుర్తించి చికిత్స పొందితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ఫార్మ్ డి మరియు బి.ఫార్మ్ విద్యార్థులు ఆసుపత్రి మరియు కళాశాల ప్రాంగణాల్లో అవగాహన కార్య క్రమాలు పోస్టర్ ప్రదర్శనలు, రోగులకు సలహాలు ఇచ్చారు. అధ్యాపకులు విద్యార్థుల సేవాభావనను ప్రశంసిస్తు ఫార్మసీ విద్యార్థులు ప్రజారోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. ద్వారా సమాజంలో మానవీయ విలువలు, సహానుభూతి మరియు అవగాహన పెంపొందించడంలో మైపర్ తన సామాజిక బాధ్యతను చాటింది.

## బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



**పాములపాడు, జనవరి 24, ప్రభాతవార్త:** బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని డాక్టర్ మహమ్మద్ బేగ్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శారదా స్కూల్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా డా.మహమ్మద్ బేగ్ మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షత చూపకుండా అన్నిరంగాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. రానున్న కాలంలో మహిళలు దేశాభివృద్ధిలో భాగస్వాములు కానున్నారన్నారు. అనంతరం బాలికల పట్ల వివక్షత చూపమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శివలక్ష్మీ, నాగమణి, నాగమద్దమ్మ, నాగమ్మ, చెన్నమ్మ, శారదా స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్‌గా బి.బాబు



**నందికొట్కూరు,జనవరి 24,ప్రభాతవార్త:** మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ గా బి.బాబు శనివారం పదవి భాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఆర్.ఓ. గా పనిచేస్తున్న మధుబాబు ప్రొద్దుటూరు మున్సిపాల్టికి బదిలి కావడంతో ఆయన స్థానంలో నరసరావుపేట నుండి ఈయన ఇక్కడికి బదిలిపై వచ్చారు.

## కందుల కొనుగోలు కేంద్రాల వద్ద కనపడని అధికారులు

**పత్తికొండ,జనవరి 24,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాకంగా రైతులకు మద్దతు ధర ఇస్తూ కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే అక్కడ రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎవరు పట్టించుకోవడంలేదని అధికారులు ఎవరు అక్కడ ఉండడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.కొనుగోలు కేంద్రాల వద్ద సంభంధిత అధికారులు ఉండేలా సంభంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## జ్యోతిబాపూలే బిసి బాలికల గురుకుల పాఠశాలలో అవగాహన

**వెల్దుర్తి, జనవరి 24, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని జ్యోతిబాపూలే బిసి బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థినీలకు కర్నూలు సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మోటివేషన్ స్పీకర్ జ్యోతిర్మయి వ్యక్తిత్వవికాసం,కెరీర్ కౌన్సెలింగ్,పదవతరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలని అనే అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థి దశలోనే బాగా చదువుకోవాలని,చదువుతోపాటు వార్తపత్రికలు,ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ తదితర వాటిని చదువుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సెట్కూర్ సిబ్బంది శ్రీనివాససింగ్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు చర్చించడానికా?లేక ?

: ముఖ్యమైన అంశాలు చర్చించకుండా సభ వాయిదా ఏమిటి? : గ్రామీణ పారిశుధ్యము ,వెలుగుపరిస్థితి ఏమిటి? : ఎవరి సౌలభ్యము కోసం మండల సభ ఏర్పాటు : మండల సభలో సభ్యులు ధ్వజము



**కోవెలకుంట్ల, జనవరి 24, ప్రభాతవార్త :** మండల సర్వసభ్య సమావేషము అంటే ప్రజలకు ఉపయోగ పడే అంశాలను మండల సభలో చర్చించ,ఇ వాటికి సభ అమోదము తీసుకోవాలి అలా కాకుండా తూతూ మంత్రంగా మండల సభ నిర్వహించి ప్రజలకు పనికి వచ్చే అంశాలు చర్చించకుండా వాయిదా ఏమిటని మండల సభలో సభ్యులు ధ్వజము ఎత్తారు.శనివారము కోవెలకుంట్ల మండల సర్వసభ్య సమావేషము స్థానిక అర్‌బికే కార్యాలయంల యంపిపి బీమిరెడ్డి రమాదేవి అద్యక్షతన ఉదయం 11.30నిమిషాలకు నిర్వహించారు. అయితే సభ కూడా అలశ్యంగనే ప్రారంభము అయింది.సభలో అజెండాలో ముఖ్యమైన గ్రామీణ పారిశుధ్యము వెలుగుపై చర్చింకుండా సభను ఎలా వాయిదా వేస్తారంటు మండలకోఅప్షన్ సభ్యులు దిల్కుబాష, బిజినవేముల ఉపసర్పంచు బీమిరెడ్డి ప్రతాపరెడ్డి ఇతర సర్పంచులు యంపిడిఓపై ధ్వజము ఎత్తారు, ప్రస్తుతము గ్రామాల్లో ఎక్కడ చూసి మురికి విలయతాంవము అడుతుందని అదికారులు ప్రతి శనివారము కేవలము పోటోలకు పోజులు ఇస్తు కాలం గడుపుతున్నాకని అరోపించారు. గ్రామాల్లో పరిశుధ్య పనులు ఎక్కడ వేసి గొంగలి అక్కడే అనే రీతిలో ఉన్నాయని అన్నారు. ఒక గ్రామానికి వీదులో దోమలు విలయతాండవము చేస్తున్నాయని ఫ్యాగింగ్,గానికి మురికికాలువ వల్లో బ్లీచింగ్, క్లోరుఫిన్ లాంటి పిచికారి చేయ్యడము లేదని అలాంటి శాఖ గురించి మండల సభలో చర్చించకుండా సభను ఎలా వాయితదా వేస్తారని ధ్వజము ఎత్తారు అసలు అశాఖకు సంబందించిన విషయాలు ఎందుకు సభ ముందు ఉంచలేదని అసలు అజెండాలో అ అంశమును చేర్చారా? లేక అజేండాలో శాఖ చర్చంకుండా మీరు ఏమైన కుమ్మకైనారా?అంటు సభ్యులు ఏకతాటపై యంపిపివ, యంపిడిఓ కూర్చున్న డయాస్ వద్దకు చేరుకుని తీవ్ర పదజాలాలతో ధ్వజమెత్తారు అంతకు మునుపు అసెండా అంశాలను యంపిడిఓ వరప్రసాదు ప్రస్థావిస్తు విద్యపై చర్చించాలని కోరగా యంఈఓ వెంకటసుబ్బయ్య సమాదానము ఇస్తు మండల విద్యాపై నివేదికచదివి వినిపించారు. దీనితో యంపిపి రమదేవి కలుగ జేసుకుని మద్యహ్నా బోజనము నిర్వహణపై వివరణ కోరగా ఇక్కడున్న నిర్వహాకులు సక్రమంగా లేరని తొలడించడము జరిగిందని చెప్పారు. అరోగ్యముపై చర్చకురాగా డాక్టరు గుర్రము అశోక్ సమాదానము ఇస్తు మండలంలో అరోగ్య విషాలపై నివేదిక సమర్పించారు.అనంతరము అనంతరము ఐసిడియస్‌పై చర్చకుడా సంబందిత సూపరువైజరు మాట్లాడుతూ మండలంలో అంగన్‌వాడీపనితీరు గురించి వివరిస్తుండగా మండలకోఅప్షన్ సభ్యులు దిల్కు బాష కలుగ జేసుకుని మీరు చిన్నారులకు అందించే షౌష్టికాహరములో పురుగులు ఉంటున్నాయని వాటిని అవులకు దానాగా వేస్తున్నారని అరోపించారు. అనంతరము పంచాయితీరాజ్‌పైచర్చకు రాగా ఎఈ సమాదానము ఇస్తు మండలానికి రెండు హెల్త్ క్లినిక్ సెంటరు మంజూరు అయ్యాయని చెప్పారు. అర్‌డబ్యుయస్‌పై రచ్చకు రాగా ఎఈ సమాదానము ఇస్తుండగా బిజినవేములు ఉపసర్పంచు బీమిరెడ్డి ప్రదాపరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రజికులకు వృత్తి చేసుకోవడానికి ఏర్పాటు చేసిన ,రెండు మోటార్లు కాలి పోయాయిన చెప్పారు. విద్యత్‌పై చర్చకు రాగా ఎఈ రాంమోహన్ సమాదానము ఇస్తుండగా మండల కోఅప్షన్ సభ్యులు దిల్కు భాష కలుగ చేసుకుని విద్యుత్ సమస్యల పట్టణంలో తీవ్రంగా ఉందని ఒక వీదిలో ఉంటే మరోక వీదిలో కోత ఉంటుందని అరోపించారు. ఉపాదిపై చర్చకురాగా ఎపిఓ శశికలారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది అంచాల వ్యయము ప్రభుత్వమే తయారు చేసి పంపుతుందని చెప్పారు. హౌసింగ్‌పైచర్చకు రాగా ఎఈ మద్దిలేటి సమాదానము ఇస్తు మండలంలో గృహనిర్మాణ శాఖ పనితీరు నివేదిక సమర్పించారు.

## ఆదోని జిల్లా కోసం.. బంద్..!

(మొదటి పేజీ తరువాయి ) : మంత్రాలయం ఎమ్మిగనూరు పత్తికొండ నియోజకవర్గాలు శనివారం బంద్ అంటూ ప్రకటించడంతో కర్ణాటక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 10 గంటలకు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఆర్టీసీ డిపో నుంచి బస్సులను బయటికి రప్పించేందుకు ప్రయత్నించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వీరేష్, సృజనమ్మ, రామలింగ,ఆయాలప్ప, విద్యార్థి సంఘ నాయకులు షాబీర్ భాష, తిరుమలేష్, రమేష్, దస్తగిరి బిజెపి నాయకులు ఉపేంద్ర, చంద్ర, వైసీపీ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, దేవా కౌన్సిలర్లు ఫయాజ్, రఘునాథరెడ్డి, అశోక్, జనసేన నాయకులు రేణువర్మ ,పులి రాజు తోపాటు జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు ఉద్యమకారుల మధ్య తోపులాట జరిగింది. కొంతమందిని పోలీసు జీపులో పోలీస్ స్టేషన్కు తరలించేందుకు ప్రయత్నించారు. వాగ్వాదాల మధ్య సిపిఐ పట్టణ కార్యదర్శి వీరేష్ స్పృహ తప్పి పడిపోవడంతో హుటావుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు ఉద్యమకారులంతా అడ్డుకొని జీపు కదలకుండా రోడ్డుపై అడ్డుకున్నారు. జిల్లా సాధన జేఏసీ నాయకులు రఘురామయ్య అశోక్ నంది రెడ్డి, లలిత, కృష్ణమూర్తి గౌడ్ కోదండ, దస్తగిరి విద్యార్థి సంఘ నాయకులు పురవీధులలో ర్యాలీ చేపట్టారు. వైసిపి బిజెపి జనసేన వేరువేరుగా ప్రధాన రహదారులలో బైక్ ర్యాలీ చేపట్టి ఆదోని జిల్లా కావాలంటూ డిమాండ్ చేశారు. ఆదోని జిల్లాతోనే సమగ్ర అభివృద్ధి, యువతకు ఉపాధి లభించి, రైతులకు సాగు తాగునీరు అందుతుందన్నారు పాలన సౌలభ్యం తో కార్యాలయాలు ఏర్పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చున్నారు ప్రభుత్వం వెంటనే ఆదోని జిల్లాగా ప్రకటించాలని అంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు.నాయకులు నూర్ హమ్మద్, మల్లికార్జున,మణి, నరసన్న,శాంత కుమార్,కమతం వెంకటేష్ తదితరులు ఉన్నారు

## యువతా.. మేలుకో..!

(మొదటి పేజీ తరువాయి ) : **నేడు ఓటర్ల నమోదుపై ప్రత్యేక కార్యక్రమం:-**

ఓటర్ల దినోత్సవంలో భాగంగా ఆదివారం ఓటర్ల నమోదుపై ప్రత్యేక కార్యక్రమంతో పాటు అవగాహన సదస్సును కూడా నిర్వహిస్తున్నారు..బిఎల్ఓలకు కేటాయించిన బూత్ పరిధిలోని ఓటర్లు ఇళ్లకు వెళ్లి ఓటు నమోదు కావాల్సిన వారిని గుర్తించి వారి చేత ఓటు నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు..ఇందుకోసం ఇప్పటికే పాఠశాలలో, కళాశాలల్లోని విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**ఓటు హక్కుపై నిరంతర అవగాహన అవసరం:-**

ఓటు హక్కుకు సంబందించి ఇప్పుడు జిల్లాలో చేస్తున్న ప్రచారం కంటే విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. ఇప్పుడు కేవలం విద్యార్థులకు పోటీలతో సరిపెడుతున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా జరగాల్సిన ప్రచారం జరగడం లేదు. కేవలం పోటీలతోనే ప్రజల్లో చైతన్యం వచ్చే పరిస్థితి లేదు. ఈ ప్రచారం జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామ స్థాయిలో జరిగినప్పుడే ఓటరుకు వారి ఓటు హక్కు గురించి తెలుసుకుంటారు. ఇక పోతే ఈ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎన్నికల విభాగం అధికారులు విద్యార్థులకు నియోజక వర్గ, జిల్లా స్థాయిలో ఉపన్యాస, వ్యాస రచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. అంతేకాక 25వ తేదిన జరిగే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థీని, విద్యార్థులకు బహుమతులు, ప్రశాంస పత్రాలను కూడా అందజేస్తారు. ముఖ్యంగా జాతీయ ఓటరు దినోత్సవం ఈ నెల 25వ తేదిన నిర్వహించేందుకు నియోజకవర్గ, మండల స్థాయిలో అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబందించి ఇప్పటికే విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రోజు జిల్లా కేంద్రంలో కలెక్టర్ నేతృత్వంలో ఓటర్ల నమోదుపై ర్యాలీ నిర్వహిస్తున్నారు..

## బాలికల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



**హాలహర్వి, జనవరి 24, ప్రభాతవార్త;** బాలికల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, విరుపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని విరుపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఆలిక విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. బాలికలకు చాలా హక్కులు ఉన్నాయన్నారు. బాలికలందరూ చదువుకునే హక్కు ఉందని, ప్రభుత్వం కూడా బాలికలు చదువుకోవడానికి చాలా రకాల పాఠశాలు ఉన్నాయన్నారు. ఏదైనా కష్టం వచ్చినా బాలికలు ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలన్నారు. ప్రతి బాలిక ఒక లక్ష్యంతో చదువుకున్నప్పుడే బాలికలు సమగ్రాభిఎద్ధి చెందినట్లు అవుతుందన్నారు. బాల్య వివాహాల రద్దు చట్టం ఉందని, బాల్య వివాహాలు ఎవరైనా చేస్తే వారికి పోలీసుల అండ ఉంటుందని తెలియజేశారు. బాలికలు మిమ్ములను మీరు కాపాడుకోవడానికి చాలా హక్కులు ఉన్నాయని, మీరు పోలీసులకు సమాచారం అందిస్తే మీ సమస్యలు పరిష్కారం చేయడానికి ఎప్పుడూ ముందుంటామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రామాంజనేయ, నాగరాజు, ధనలక్ష్మి, హిమశైలజ, హరిత, వినయ్‌కుమార్, భరత్ పాల్గొన్నారు.

## ఓటర్ దినోత్సవంపై ర్యాలీ

– ఓటు హక్కుపై అవగాహన కల్పించిన తహసీల్దార్




**మద్దికెర, జనవరి 24, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మద్దికెరలోని శ్రీ విద్యాసాయి జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో శనివారం ఓటర్ దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథిగా తహసీల్దార్ గుండాలనాయక్ హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించి, విద్యార్థినీ, విద్యార్థులు నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం ఓటర్లను చైతన్యపరచడానికి అవగాహన పెంచడానికి విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగోలి, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ యజ్ఞం మాధవ్, ప్రిన్సిపాల్ సునీత, పాఠశాల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గాడి తప్పిన కూటమి పాలన

- రానున్నది.. జగనన్న పాలనే - కార్యకర్తలతోనే రాజ్యాధికారం
- జిల్లా వైసీపీ సమన్వయకర్త ఎస్వీ మోహన్‌రెడ్డి



**కోడుమూరు, జనవరి 24, ప్రభాతవార్త :** రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వ పాలన గాడి తప్పిందని జిల్లా వైసీపీ అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కోడుమూరు పట్టణంలో ఒక ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌ల్లో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంను నిర్వహించారు. అధ్యక్షులుగా కోడుమూరు నియజక వర్గ ఇంచార్జ్ ఆదిమూలపు సతీష్ వ్యవహరించగా వైసీపీ ఎస్ఇసి నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కర్నూలు పార్లమెంట్ ఇంచార్జ్ బుట్టారేణుకమ్మ, కోడుమూరు మాజీ శాసన సభ్యులు ఎం.మణి గాంధీ, వైసీపీ నాయకులు యాపదిన్నె మద్దిలేటిలు హాజరయ్యారు. సమావేశంలో ఎస్వీ మోహన్‌రెడ్డి కూటమి పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుష్క వాగ్దానాలతో గద్దెనెక్కిన కూటమి పాలనపై అంతటా ప్రజలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యావన్నారు. అందుకే కూటమి నేతల్లో భయ్యం పుట్టుకురావడంతో ఎవరికి వారు దోచుకోవడం దాచుకోవడమే ధ్యేయంగా ఎంచుకున్నారన్నారు. దీంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాలను దెబ్బతీసిందన్నారు. గత ఐదేళ్ల పాలనల్లో రైతులకు ఏనాడు యూరియ కొరత రాకుండా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి పాలనల్లో రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరల్లేక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతందని, రాష్ట్రం అంతటా జగనన్న పాలన రావాలనే అంతటాజనం వైసీపీకి నిరాజనాలు పట్టుతున్నారన్నారు. వచ్చేది జగనన్న పాలనే .. అయితే ఈ సారి పాలన అంతా కార్యకర్తలే రాజ్యాధికారులుగా వ్యవహరిస్తారన్నారు. గాడి తప్పిన పాలన విధానాలను త్వరల్లో ఎండగట్టేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీఅధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు.

**అధైర్య పడకండి అండగా నే.. నున్నా... కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి :**

అధైర్య పడకండి అండగా నేనున్నానని రాష్ట్ర వైసీపీ ఎస్ఇసి నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కోడుమూరు నియోజకర్గ స్థాయిలో ఎక్కడైనా వైసీపీ శ్రేణులపై ఎలాంటి ధౌర్జన్యాలు కానీ, బెదిరింపులు, అక్రమ కేసులు బనాయించి బెదిరిస్తే వాటిని చూసి బెదరవద్దని అలాంటి వాటిని ఎదుర్కొనేందుకు నేనున్నానని భరోసా ఇచ్చారు. ఇటీవల కర్నూలు మండల ఎంపీపీ స్థానంపై పసుపు జెండాను ఎగురు వేసేందుకు టీడీపీ చేసిన కుట్రలను తాను ఎదుర్కొని వైసీపీ స్థానంను పదిలం చేసుకోగలిగా మన్నారు. ఈ కార్యక్రమంలో



నియోజక వర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండల్లాల వైసీపీ నాయకులు బైటింటి రమేష్ నాయుడు, డీలర్ క్రిష్ణారెడ్డి, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, గూడూరు ఎంపీపీ సునీతమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి, కొంతలపాడు శ్రీనివాస రెడ్డి, ప్రభాకర్, జిల్లా సోషల్ మిడియా అధ్యక్షులు మధుశేఖర్, సోమశేఖరరెడ్డి, మోహన్‌బాబు, రామాంజినేయులు, సి.బెళగల్ మండల నాయకులు ఎస్.ఎం భాష, జగధీష్, శంకర్, వీరన్న, క్రిష్ణాపురం శ్రీనివాసరెడ్డి, మాదుల, లింగమయ్య, రాఘవేంద్ర, లింగన్న, శివరాముడు పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణ అందరి బాధ్యత



**పగిడ్యాల, జనవరి 24, ప్రభాతవార్త :** బాలికల సంరక్షణ అందరిబాధ్యతనీ పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఏపి మోడల్‌స్కూల్‌లో శనివారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గర్భస్థశిశువులను ఆటపిల్లఅయితే తీయించుకోవడం లాంటి చర్యలు చేయరాదనీ, వారిని అలా చేయకుండా కాపాడుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పెరిగేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికల బాల్యవివాహాలను నివారించేందుకు చర్యల గురించి తెలుసుకోవాలన్నారు. ఆడపిల్లలలో వస్తున్న మార్పుల గురించి, ఆదేవిధంగా ఆడపిల్లలను భావిభారత మహిళాలుగా తీర్చిద్దాలనీ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, వారి సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ రామగుర్రప్ప, పిహెచ్ఎన్ మల్లేశ్వరి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

## కళాశాలలో జాతీయ దినోత్సవాలు



**బనగానపల్లె, జనవరి 24, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర మరియు మహిళా సాధికారత ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం మరియు జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. లలిత అధ్యక్షత వహించారు. డా. ఎస్. లలిత మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం, అలాగే బాలికల హక్కులు, విద్య, సాధికారతపై అవగాహన కల్పించడం మరియు ఓటు హక్కు ప్రతి పౌరునికి ఉన్న అత్యంత విలువైన తమ ఓటు హక్కును యువత బాధ్యతగా వినియోగించుకుంటే దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది అని ఆమె అన్నారు. అలాగే బాలికా దినోత్సవం సందర్భంలో, బాలికల విద్య, భద్రత, సమానత్వం సాధించినప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి చెందుతుంది అని పేర్కొన్నారు. చరిత్ర విభాగ అధ్యాపకులు డా. కె. బడే సాహెబ్ మాట్లాడుతూ, భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓటు హక్కు ఉద్యమాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రజాస్వమ్య విజయం ఓటర్ చైతన్యం పై ఆధార పడి ఉంటుందన్నారు మహిళా సాధికారత కన్వీనర్ డా. జి. నీతమ్మ మాట్లాడుతూ, బాలికలపై ఉన్న సామాజిక అడ్డంకులను తొలగించి, వారికి విద్యా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. బాలికల హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వం సాధన కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కళాశాల అధ్యాపకులు, డాక్టర్ జె వసుంధరమ్మ, డాక్టర్ జె సుధాకర రెడ్డి, డాక్టర్ శ్రీ యన్ ఉమామహేశ్వర రెడ్డి, డాక్టరీ కె రామకృష్ణ డాక్టర్ ఎస్ మొహమ్మద్ గౌస్, శ్రీ ఏం రామన్న, శ్రీమతి సి వరలక్ష్మి, శ్రీ రవి వకుమార్, శ్రీమతి కౌసల్య దేవి , డాక్టర్ తిమ్మయ్య, శ్రీమతి ఫాతిమా, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గున్నారు.

## యువతలో దేశభక్తిని, లీడర్‌షిప్‌ను పెంచేది ఎన్‌సీసీ



**ఆదోనిలీగల్, జనవరి 24, ప్రభాతవార్త;** యువతలో దేశభక్తిని, లీడర్‌షిప్‌ను పెంచేది ఎన్‌సీసీ అని కెప్టెన్ భీమన్యు అరుణ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో శనివారం ఎన్‌సీసీ ఏ సర్టిఫికేట్ ప్రాక్టికల్ పరీక్షలు ఎన్‌సీసీ 1 ఆంధ్ర మెడికల్ కంపెనీ, కర్నూలు కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ భీమాన్యు అరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలో వివిధ అంశాలకు సంబంధించి ఎన్‌సీసీ కాడెట్‌ల సామర్థ్యాన్ని పరీక్షించారు. పట్టణంలోని నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని దాదాపు వంద మంది కాడెట్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు లభించే ప్రయోజనాలను, దేశ భవిష్యన్ను యువత ద్వారా తీర్చిదిద్దడానికి లభించే అవకాశంగా ఉపయోగించుకోవాలన్నారు. ఎన్‌సీసీ అధికారులు ఏఎన్ఓ ఎం.అనిల్‌కుమార్, వి.సురేష్‌కుమార్, సీనియర్ జేసీఓ సిజ్జు కె.పి.అప్పారావు, రవికుమార్, నానాజి, సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్, శివకుమార్, ఎన్‌సీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లను తీసుకెళ్లడం తగదు..!



**హొళగుంద, జనవరి 24, ప్రభాతవార్త;** గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను తీసుకెళ్లడం తగదని హొళగుందకు చెందిన లబ్ధిదారులు నాగరాజు, తిమ్మప్ప, మహాదేవ, ముదుకప్ప, వీరేష్‌లు విద్యుత్‌శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. హొళగుంద గ్రామ సమీపంలో గజ్జహళ్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన సర్వేనంబర్ 217లో 720 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయన్నారు. కాలనీల్లో ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారన్నారు. ఏమయ్యిందో ఏమో కానీ విద్యుత్ శాఖ అధికారులు ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడే వదిలి మిగిలిన 5 ట్రాన్స్‌ఫార్మర్‌లను అక్కడి నుంచి తీసుకెళ్లారన్నారు. ఇంకా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లను నిర్మించుకోవడానికి విద్యుత్ సమస్య నెలకొందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బందిని ప్రశ్నించినా పట్టించుకోవడం లేదన్నారు. అర్ధాంతరంగా కాలనీ నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎక్కడికి తరలించారో కూడా తెలియదన్నారు. ఇప్పటికైనా ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లను కాలనీలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వారు విద్యుత్‌శాఖ కార్యాలయానికి చేరుకుని, జగనన్న కాలనీలో ఫీజు పోతే ఫీజు వేయడానికి డబ్బులు తీసుకుంటున్నారని, డబ్బులు ఇస్తేనే ఫీజు వేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. జగనన్న కాలనీలో ఫీజు పోతే మూడు, నాలుగు రోజులైనా పట్టించుకోవడం లేదని విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



**మంత్రాలయం, జనవరి 24, ప్రభాతవార్త;** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ రాజేశ్వరిదేవి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ సుమిత్రమ్మ ఆధ్వర్యంలో హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలపై మక్కువ చూపాలన్నారు. బాలికలపై వివక్ష చూపడం తగదన్నారు. బాలికలను బరువు అనుకోకుండా బాధ్యతగా పెంచాలన్నారు. వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. బాలికల భ్రూణ హత్యలు మానా లన్నారు. ఈ హత్యలు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు బి.వి.శ్వేత, భీమేశ్వరి, కళ్యాణి, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థికసహాయం



**వెల్దుర్తి, జనవరి 24, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణానికి చెందిన సురేష్ కుమార్తె(చిన్నారి)కు కండరాల క్షణత అనే వ్యాధి సోకి చికిత్స చేసేందుకు రూ.16 కోట్లు అవుతుందని చిన్నారి కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను గమనించిన వెల్దుర్తి పట్టణంలోని పద్మవిద్యావికాస్ అనే ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ బడేసాహెబ్ తన వంతుగా ఆ చిన్నారికి రూ.10వేలు ఆర్థికసహాయంను ప్రకటించారు. చిన్నారి తల్లితండ్రులను శనివారం పాఠశాలకు పిలిపించుకొని పదివేల రుపాయల నగదును అందజేసి తన దాతృత్వం చాటుకున్నారు.

## 3, 4రోజుల్లో కాలువకు పులికనుమ నీళ్లు విడుదల..



**పెద్దకడబూరు, జనవరి 24, ప్రభాతవార్త :** ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న రబీ పంటను కాపాడుకోవడానికి సాగునీరు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి, అధికారులతో మాట్లాడి మూడు, నాలుగు రోజుల్లో పులికనుమ ప్రాజెక్టు నీరును రైతులు అవసరానికి ప్రస్తుత పంటను కాపాడుకోవడానికి విడుదల చేయాలని నిర్ణయించడం జరిగిందని ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు డీసీ చైర్మన్ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి అన్నారు శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ పులికనుమ ప్రాజెక్టు నీటి విషయమై ఈనెల 28 వ తారీఖున సాగునీటి సంఘ అధ్యక్షులకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం ఏర్పాటు చేశారు ఇది మా ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న నిబద్ధత అన్నారు గత ప్రభుత్వంలో రైతులును గాని, సాగునీటి సంఘాలు గాని, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్ని కాని పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు సాగునీరు విడుదల చేసి రైతుల పంటలు కాపాడుతున్న ముఖ్యమంత్రి గారికి, నీటి శాఖ మంత్రి గారికి, అధికారులకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

## గ్రామ పరిసరాల్లో సంపూర్ణ శుభ్రతే లక్ష్యం



**పత్తికొండ రూరల్, జనవరి 24 ప్రభాతవార్త :** పట్టణంలోనూ, గ్రామాల్లోనూ శానిటేషన్ లోటు లేకుండా సంపూర్ణ శుభ్రత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు ప్రజలు తమ పరిసరాల్లో శుభ్రతను పాటించాలని పత్తికొండ మండల ఎంపీడీవో కవిత ప్రజలను కోరారు. శనివారం పత్తికొండ మేజర్ పంచాయతీ పరిధిలో ప్రతినెల మూడో శనివారం చేపట్టే ఎస్ఏఎస్ఏ ప్రోగ్రాంలో భాగంగా పత్తికొండ ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్, డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో స్థానిక మూడవ సచివాలయం నుండి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వరకు ర్యాలీ నిర్వహించి ఖీజీరో గ్యాప్ శానిటేషన్ థీమ్ ఆంధ్రఖీ అనే అంశంపై ప్రజల కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ప్రజలు ఆరుబయట మలవిసర్జన చేసే అలవాట్లు మానుకోని, ఇంట్లో ఏర్పరచుకున్న మరుగుదొడ్లను వాడాలన్నారు. పరిసరాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని, అందువల్ల ప్రజల ఆరోగ్యానికి భద్రత ఉంటుందన్నారు. పరిసరాల్లో చెత్త ఎక్కడపడితే అక్కడ పడకుండా చెత్తను పొడి చెత్త, తడి చెత్తను వేరు చేసి ఇంటింటికి వచ్చి చెత్త సేకరణ కు వచ్చే బండిలోనే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక హాస్పిటల్ ప్రాంగణం నందు పారిశుద్ధ్య సిబ్బంది చేత శుభ్రం చేయించి, ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు.

## కష్టపడిన వారికి పదవులు ఇవ్వడం సంతోషకరం

- మండల ఎస్సీ సెల్ కన్వీనర్ తప్పెట శ్రీనివాసులు



**మద్దికెర, జనవరి 24, ప్రభాతవార్త;** మద్దికెర మండలంలో టీడీపీ పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు ఇచ్చేందుకు అధిష్టానం సిద్ధంగా ఉందని మండల ఎస్సీ సెల్ కన్వీనర్‌గా ఎంపికైన తప్పెట శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న తనను కులాలకు, మతాలకు అతీతంగా పార్టీ నా యొక్క కష్టాన్ని గుర్తించి మండల ఎస్సీ సెల్ కన్వీనర్‌గా ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడతానన్నారు. నాకు పదవిని ఇచ్చేందుకు ప్రోత్సహించిన మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జంబునాథ రాయుడు, గడ్డం రామంజి, విటోబా, సతీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి



**క్రిష్ణగిరి, జనవరి 24, ప్రభాతవార్త :** సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని వెల్దుర్తి సి.ఐ యుగంధర్ అన్నారు. శనివారం మండలకేంద్రమైన క్రిష్ణగిరిలోని స్త్రీశక్తి భవనంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ఆదునిక యుగంలో కేటుగాళ్లు రకరకాల పద్ధతులు ఉపయోగించి డబ్బును దోచుకుంటున్నారు. మన సెల్‌ఫోన్లకు ఏమైనా లింకులు పంపించి క్లిక్ చేయమని మెసేజ్‌లు పంపిస్తే వాటిని క్లిక్‌చేయకూడ దన్నారు. ఇటీవల కాలంలో ఈ లింకు క్లిక్ చేస్తే మీకు రూ5వేలు వస్తాయని వీటిని 10 మందికి పంపిస్తే మీకు అందుతాయని కేట్‌గాళ్లు ఆశ చూపించారు. మీరు క్లిక్ చేస్తే మీ అకౌంట్ హ్యాక్ అవ్వడంతో పాటు మీ వ్యక్తి గత సమాచారం తస్కరించబడుతుందన్నారు. ఇటువంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని నెంబర్ల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. మీరు ఎటువంటి ఆపదలో చిక్కుకున్న వాట్సప్ ద్వార పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మీకు దగ్గరలోని పోలీసుల నుంచి మీకు రక్షణ కల్పిస్తామన్నారు. మీరు ఈ విషయాలను తెలుసుకోవాల న్నారు. క్రిష్ణగిరి యస్.ఐ క్రిష్ణమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

## మిగులు భూముల సమస్యలను పరిష్కరించేందుకు కృషి



**గోనెగండ్ల, జనవరి 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రెవెన్యూ రికార్డులలో మిగులు భూములు మరియూ ఇతర భూముల సమస్యలను పరిష్కరించేందుకు గాను రెవెన్యూ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని డిప్యూటీ తహశీల్దార్ రఘువీర తెలిపారు. ఈ సందర్భంగా గోనెగండ్ల మండలంలో గోనెగండ్ల, పెద్దనేలటూరు, గంజహళ్లి, గ్రామాలో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. అందులో బాగంగా శనివారం మండల కేంద్రమైన గోనెగండ్ల, గంజహళ్లి, గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. రఘువీర మాట్లాడుతూ గోనెగండ్ల, గంజహళ్లి, పెద్దనేలటూరు గ్రామాలోని రెవెన్యూ భూముల రికార్డులు ఆన్‌లైన్‌లోకి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆయా గ్రామాలలో మిగులు భూములు ఉన్న సర్వే నెంబర్‌లను గ్రామ సభలలో చదివి వినిపించారు. పెద్దనేలటూరు గ్రామంలో 1.28 ఎకరాలు, గోనెగండ్లలో 303.49 ఎకరాలు, గంజహళ్లి గ్రామంలో 508.07 ఎకరాలు మిగులు భూములుగా ఉన్నాయని అన్నారు. కావున ఆభూములకు సంబంధించి భౌతికంగా అనుభవంలో ఉన్న రైతులు రికార్డులలో ఇంకా మిగులు భూమి అని ఉంటే వారు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తాము సాగులో ఉన్నట్లు అయితే సంబంధింత యాజమాన్య పత్రాలను ఆధారాలను రెవెన్యూఅధికారులకు సమర్పించాలి. రికార్డులో ఉన్న మిగులు భూమి ఎంట్రీని తొలిగించి తమ పేరును పట్టాదారుగా నమోదు చేసుకొవడం కోసం ధరఖాస్తు చేసుకోవాలి. వారంలో లోపు సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తారు అని తెలిపారు. ఈ గ్రామ సభలలో రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## మిగుల భూముల వివరాలు తెలపండి



**హాలహర్వి, జనవరి 24, ప్రభాతవార్త ;** మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు మిగుల భూముల వివరాలను తెలపాలని తహసీల్దార్ లక్ష్మినారాయణ రైతులను కోరారు. శనివారం మండలంలోని చింతకుంట, గూళ్యం, జె.హొసల్లి, శిరుగాపురం గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఏవైనా ఉంటే తమదృష్టికి తీసుకురాఆవాలని కోరారు. మండలంలోని గూళ్యం, చింతకుంట, శిరుగాపురం, జె.హొసల్లి, సాకిబండ, మల్లికార్జునపల్లి గ్రామాల్లో మిగులు భూమి 74 ఎకరాలు ఉందని తెలిపారు. ఈ భూములను ఎవరు సాగులో ఉన్నారో ఆ రైతులు మిగులు భూములకు సంబంధించిన దస్తావేజులు తీసుకురావాలని కోరారు. దస్తావేజులు పరిశీలించి సాగులో ఉన్న రైతులు పేరుతో మూటేషన్ ద్వారా వన్‌బీ, అడంగల్ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 31న మిగులు భూముల విచారణ కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రాఘవేంద్రస్వామి, లింగప్ప, నాగరాజు, వీరేష్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శివశంకర్‌రెడ్డి మృతికి ప్రగాఢ సంతాపం తెలిపిన ఎమ్మెల్యే బుడ్డా

- పార్థీవ దేహానికి టిడిపి జండాతో సత్కారం

**వెలుగోడు, జనవరి 24, ప్రభాతవార్త:** పట్టణ ప్రథమ ఎంబిబిఎస్ వైద్యులు, పెట్రోలు బంక్ యజమాని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండల అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యక్తిగా పేరుగాంచిన డాక్టర్.శివశంకర్‌రెడ్డి అనారోగ్యంతో కార్పోరేట్ వైద్యశాలలో చికిత్స పొందుతు కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కుటంబసభ్యులు శనివారం ఉదయం స్వగృహానికి తీసుకొని వచ్చారు, ఈ విషయం తెలియడంతో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శంచి నివాళీలు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా నంద్యాల మాజీ ఎం.పి.పోచబ్రహ్మనందరెడ్డి, మాజీ ఎంపిపి బుడ్డా శేషారెడ్డి, వెలుగోడు మండల ఎంపిపి లాలం రమేష్, ఎస్.డి.పి.ఐ.రాష్ట్ర మాజీ నాయకులు మీర్జా అబ్దుల్ బేగ్. మాజీ సర్పంచులు అల్లె తిరుపాల్‌రెడ్డి, ముల్లా అబ్దుల్ కలాం, సందర్శించి తమ ప్రగాడ సంతాపాన్ని తెలిపారు. డాక్టర్.శివశంకర్‌రెడ్డి కర్నూలు వైద్యశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి జమ్ములమడుగు మిషన్ వైద్యశాలలో వైద్య సేవలు అంధించారు. అక్కడి నుండిఇ వెలుగోడు పట్టణంలో వైద్యశాల ఏర్పాటు చేసి వైద్య సేవలు అంధించారు. పట్టణంలో పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేశారు. ఆయన సతీ మణి వెలుగోడు ఎంపిపిగా మండలవిద్యార్థుళ విద్యాభివృద్ధికోసం కృషిచేశారు. పట్టణంలో మోక్షదామం (హిందూస్మశానవాటిక) ఏర్పాటుకు ఎనలేని కృషిచేసి ఉమ్మడి కర్నూలు జిల్లాలో వెలుగోడు మోక్షాదామాన్ని అన్ని వసతులతో ప్రథమ స్థానంలో నిలిపారు. దాదాపు 50 ఏళ్ళ క్రితం ఆయన గెండె కృత్రిమ యంత్రం సహాయంతో ఆరోగ్యంగా ఉండేవారు. దేశంలోనే 50 సంవత్సరాల పాటు గుండె కృత్రిమ యంత్రంతో ఆరోగ్యంగా జీవనం గడిపిన వ్యక్తిగా పేరు పొందారు. ఆఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్దద కుమార్తె మూడు సంవత్సరాల క్రితం మృతి చెందారు, రెండవ కకుమార్తె హారిణి వైద్యురాలుగా అమెరికాలో స్థిపడ్డారు. మూడవ కుమార్తె శైలజ, వైద్యురాలుగా కరీంనగర్‌లో సేవలు అంధిస్తున్నారు. కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తు కాంట్రాక్టర్‌గా ఉన్నారు. కోడలు స్త్రీ వ్యాధి నిపుణులుగా సేవలు అంధిస్తున్నారు. శనివారం మూడు గంటల నుండి అంతిమ యాత్ర మోక్షాతామం వరకు కొనసాగింది అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే బుడ్డా



**మహానంది, జనవరి 24, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మహానంది మండల పరిధిలోని తమడపల్లె గ్రామానికి చెందిన శేషాద్రి అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదం వల్ల మృతిచెందిన విషయం తెలిసిందే. విద్యుత్‌శాఖ తరుపున మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 లక్షలు అందజేశారు. ఈకార్యక్రమంలో మహానంది మండల టీడీపీ అధ్యక్షులు కంచర్ల శివశంకర్ చౌదరి, తమడపల్లె టీడీపీ నాయకులు, పార్లమెంటు ఉపాధ్యక్షులు శ్యామల జనార్ధన్‌రెడ్డి, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, క్రాంతికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## మహానందీశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జీ పూజలు



**మహానంది, జనవరి 24, ప్రభాతవార్త:** మహానంది పుణ్యక్షేత్రంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారి దర్శనార్థమై వచ్చిన వీరికి ఈవో శ్రీనివాసరెడ్డి, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి అమ్మవార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈవో శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేయగా వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర్‌శర్మ, హనుమంతు శర్మలు వేద ఆశీర్వవచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, పోలీసులు ఉన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- జెసి నూరుల్ ఖమర్ - కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కర్నూలు జెసి...



**వెల్దుర్తి, జనవరి 24, ప్రభాతవార్త :** కందుల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. వెల్దుర్తి పట్టణ సమీపంలోని జాతీయరహదారి ప్రక్కన గోడౌన్‌లో ఏపి మార్క్‌ఫెడ్, కెడిసిఎంఎస్ తరపున ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని కర్నూలు జెసి నూరుల్ ఖమర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎన్‌సిసిఎఫ్ ద్వార రైతులవద్ద నుంచి ప్రభుత్వం మద్దతుధర రూ.8వేల రుపాయలకు కొనుగోలుచేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెసి రైతులకు సూచించారు. కొనుగోలుకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని జెసి రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్క్‌ఫెడ్ డిఎం రాజు, ఇంచార్జ్ తహశీల్దార్ గురుస్వామిరెడ్డి, మండల వ్యవసాయధికారి అక్బర్‌బాష, ఆర్ఐ మంజుల, డిసిఎంఎస్ జిల్లా మేనేజర్ రాజేష్ కుమార్, వెల్దుర్తి కందుల కొనుగోలు అధికారి షేక్షావలి, ఎన్‌సిసిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

## శనగలు మిషన్ లో పడి కురువ వెంకటస్వామి మృతి



**కర్నూలు సీటీ, జనవరి 24, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా కల్లూరు మండలం, సల్కాపురం గ్రామం నకు చెందిన కురువ వెంకటస్వామి (55) ఈ రోజు శనగల మిషన్ లో పడి ఆకస్మిక మరణం చెందారు. వారు గ్రామంలో కులజుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసేవారు. వారి మరణం చాలా బాధాకరం, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము. వారి కుటుంబ సభ్యులకు కర్నూలు జిల్లా కురువ సంఘం తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేయుచున్నాము. వెంకటస్వామి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు రంగస్వామి ధనుంజయ తవుడు శ్రీనివాసులు నాగన్న పుల్లన్న తదితరులు డిమాండ్ చేశారు.

## కొలిమిగుండ్లలో స్వచ్ఛరథం ప్రారంభం



**కొలిమిగుండ్ల, జనవరి 24, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని ఆర్టీసి బస్టాండ్ వద్ద శనివారం ఎంపీడివో దస్తగిరి ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండల టీడీపీ ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి ఆద్వర యంలో కలిమిగుండ్ల గ్రామానికి పరిసరాల పరిశుభ్రత పారిశుద్ధ్యంతో భాగంగా స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలోని ప్రజలందరు చెత్తను రోడ్ల మీద వేయకుండా చెత్తరథంలో వేసి వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈసందర్భంగా ఎంపీడివో దస్తగిరిబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపీడివో చంద్రమౌళీశ్వర్‌రెడ్డి గౌడ్, సర్పంచ్ శివరాముడు, సచివాలయ సిబ్బంది గ్రామంలోని టీడీపీ నాయకులు గూళి నాగేశ్వర్‌రెడ్డి, బి శ్రీనివాసులు, బోయ కుళాయప్ప, నిమ్మకాయల దస్తగిరి, గోపాల్, బోయ రవికుమార్, తెలుగు రామయ్య, మేకల రామేశ్వర్‌రెడ్డి, గూళి రామచంద్రారెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి, ఉలువల ప్రసాద్, బోయ చంద్రగోపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఈనెల 27న సర్వసభ్య సమావేశం

**పాములపాడు. జనవరి 24, ప్రభాతవార్త:** ఈనెల 27న పాములపాడు ఎంపీడివో కార్యాలయం నందు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడివో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ సరోజీ వర్జినీయా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుందని వివిధ శాఖల మండలస్థాయి అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, హాజరుకావాలని కోరారు.

NATIONAL SEEDS CORPORATION LIMITED
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11, Tukaram Gate, Lalaguda, Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

**NOTICE INVITING TENDER**

Tenders are invited for **"Leftover Construction work of Precast Compound wall, Steel Board and Writing work on steel board at Production Center, Gooty under Area Office, NSC, Kurnool.** The Bid may be seen and downloaded from NSC website https://www.indiaseeds.com/ and e-nivida portal https://indiaseeds.enivida.com. The last date for submission of Bids is **09.02.2026 at 03.00 P. M. and will be opened on same day at 03.30 P.M.** The detailed terms and conditions can be seen from tender documents.
Any changes will be placed only on NSC web-site.

F. No. Engg (Gooty-Boundary wall)/NSC: HYD/25-26/
DATED 24.01.2026

(GAJANAND SINGH)
REGIONAL MANAGER

# గ్రామాల్లోని ప్రజలు స్వచ్ఛరధం వాహనం ఉపయోగం కోవాలి

**కర్నూలు అర్బన్ జనవరి 24 ప్రభాతవార్త;** కల్లూరు మండలం పర్ల గ్రామ పంచాయతీ యందు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగముగా జిల్లా కలెక్టర్ డా. సిరి, మరియు పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి స్వచ్ఛరథం వాహనం ను పచ్చజెండా ఊపి ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఈ స్వచ్ఛ రథం ప్రతిరోజు ఒక గ్రామ పంచాయతీ లకు తిరుగుతుందని ఆ వాహనములో అవసరమైన నిత్యావసర సరుకులను, మీ ఇంటి యందు వృధాగా పడి ఉండే సమానులు అనగా ప్లాస్టిక్, ఇనుము,



న్యూస్ పేపర్లు మరియు పుస్తకములు వాటిని తూకం వేసి, అందుకు వచ్చు రూపాయలతో ప్రజలకు కావలసిన సామాగ్రిని విక్రయించవచ్చును. కాబట్టి మండలములోని ప్రజలందరూ మీ గ్రామమునకు వచ్చినప్పుడు ఈ సదావకాశమును ఉపయోగించు కోవలసినదిగా తెలిపియున్నారు. ఈ కార్యక్రమం జి. నాసరా రెడ్డి, ముఖ్యకార్యనిర్వాహణాధికారి, జిల్లా పరిషత్, కర్నూలు, డా, వేణుగోపాల్ మండల ప్రత్యేక అధికారి, కల్లూరు, జి. నాగశేషాచాలా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, కల్లూరు, ఆంజనేయులు, తహసీల్దార్, కల్లూరు. జి. నగేష్, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, కల్లూరు, జాకిర్ హుస్సేన్, లీబీవీ ఎంజిఓ, మరియు మండల అధికారులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో, సిబ్బంది పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేద్దాం

**మంత్రాలయం, జనవరి 24, ప్రభాతవార్త;** ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని, స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేద్దామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మంత్రాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రూపొందించిన స్వచ్ఛ



ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ప్రజల జీవితాల్లో నిజమైన మార్పుకు బాటలు వేస్తోందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి గ్రామానికి ప్రగతి చేరాలన్నదే కూటమి ఆశయమని స్పష్టంగా వెల్లడించారు. ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మాజీ జెడ్పీటీసీ ఆర్. లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, ఏపీఓ భక్తవత్సలం, పంచాయతీ సెక్రటరీ, మంత్రాలయం ఎంపీటీసీ వెంకటేష్, సొసైటీ డైరెక్టర్ డీసీసీ తిమ్మప్ప, గోల్డ్ నరసింహ తిమ్మప్ప, పవన్‌కుమార్, మల్లికార్జున, రఘు, శివ, డేవిడ్, రాజన్న, మేకల నరసింహులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# మార్కెట్ యార్డ్ కమిటీకి వరుస సెలవులు

**కర్నూలు అర్బన్ జనవరి 24 ప్రభాతవార్త;** కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకి వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. తేది 25.01.2026 ఆదివారం ప్రభుత్వ సెలవు కాగా, తేది 26.01.2026 సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సెలవు ప్రకటించడమైనది. అలాగే బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో ఉన్నందున తేది 27.01.2026 మంగళవారం బ్యాంకు కార్యకలాపాలు లేకపోవడంతో, కమీషన్ ఏజెంట్ల అభ్యర్థన మేరకు ఆ రోజు కూడా మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించబడినట్లు తెలిపారు. కావున రైతుసోదరులు పై తెలిపిన తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డుకు ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావద్దని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్. జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మరలా తేది 28.01.2026 బుధవారం నుండి యధావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని, ఈ విషయాన్ని రైతు సోదరులు గమనించవలసిందిగా తెలిపారు.

# జేఏసీ తలపెట్టిన బంద్‌కు ఎమ్మెల్యే మద్దతు



**ఆలూరు, జనవరి 24, ప్రభాతవార్త:** ఆదోని జిల్లా ప్రకటించాలని కోరుతు జేఏసీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన అయిదు నియోజకవర్గాల బంద్‌కు ఆలూరు ఎమ్మెల్యే బూషినే విరుపాక్షి మద్దతు తెలిపారు. నియోజకవర్గాల బంద్ పూర్తిగా విజయవంతం అయింది. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఆదోని జిల్లాగా మారితేనే చుట్టు ప్రక్కల నియోజకవర్గాలైన ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం అభివృద్ధి చెందుతాయన్నారు. ఆలూరు నియోజకవర్గం ప్రజలకు ఆదోని జిల్లా అయితే దగ్గర అవుతుందని, కర్నూలు 120 కి.మీ. ఉంటుందన్నారు. ఈ విషయం వై.సి.పి. అధినేత మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొని పోతామని తెలిపారు. జేఏసీ తలపెట్టిన బంద్‌కు అన్ని వామపక్ష పార్టీలు ప్రజలు స్వచ్ఛంధంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్తానిక నాయకులు, వైసిపి నాకులు, బి.వి.ఆర్. అభిమానులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ 100 శాతం జరగాలి

**- నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్**



**కర్నూలు మున్సిపల్, జనవరి 24, ప్రభాతవార్తః** నగరంలో ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం పక్కాగా అమలు అయ్యేలా అన్నిశానిటేషన్ డివిజన్లలో కఠినచర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్ ఆదేశించారు. ఈఅంశాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకొని పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. శనివారం తమ క్యాంపు కార్యాలయంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తడి పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా సేకరించాలని ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు 100 శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ జరిగేలా సిబ్బంది పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అలసత్వం లేదా మిస్ అవ్వడం జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన రహదారులు, మార్కెట్‌లు, పాఠశాలలు, ఆసుపత్రులు బస్టాండ్‌ల వద్ద పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగాలని ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ తెలిపారు. నేగటివ్ ఫీడ్‌బ్యాక్ లేదా ఫిర్యాదు వచ్చిన రోజు ఫీల్డ్ విజిట్‌చేసి సమస్యను పరిష్కరించి క్లోజ్‌చేయాలని సూచించారు. నేటి నుంచి అన్నిఫీల్డ్ సిబ్బంది ఐవిఆర్ఎస్ సూపర్‌వైజర్లు పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించాలని నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని సూచించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగప్రసాద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో రైతు మృతి

**మహానంది, జనవరి 24, ప్రభాతవార్తః**



మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన రైతు కొలిమి మొత్తుమ్ (50) విదు ్యత్ ప్రమాదం వల్ల మృతిచెందారు. మృతుడికి ఆంజనేయపురం గ్రామ సమీపంలోని అంకిరెడ్డి చెరువు సమీపంలో వ్యవసాయం భూమి ఉంది. అడవి జంతువుల నుండి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టు సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే శనివారం పొలం వద్దకు వెళ్లిన రైతు సోలార్ కనెక్షన్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది. సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మహానంది ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నంద్యాలలో ట్రాఫిక్ నియంత్రణపై.. మంత్రి ఫరూక్ ప్రత్యేక దృష్టి

**- రూ.3 కోట్లతో చామకాల్వపై బ్రిడ్జి నిర్మాణం**
**- ఎన్‌కే రోడ్డు ఎన్జీవో కాలనీకి అనుసంధానం**

**నంద్యాల, జనవరి 24, ప్రభాతవార్త ప్రతినిధిః** నంద్యాల పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని భవిష ్యత్తులో ట్రాఫిక్ రద్దీని శాశ్వత ప్రాతిపదికన నియంత్రించేందుకు వీలుగా న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ చర్యలు చేపట్టారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న లో లెవెల్ బ్రిడ్జి వద్ద వరదల సమయంలో రాకపోకలు బంద్ కష్టాలు, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు రోడ్డు నుంచి ట్రాఫిక్ రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఎన్జీవో కాలనీకి శ్రీనివాసనగర్, నూనెపల్లె, (ఎన్‌కే



రోడ్డు)నుంచి రాకపోకలు అనుసంధానం చేస్తే ట్రాఫిక్ నియంత్రణకు మార్గం సుగమం అవుతుందని మంత్రి ఫరూక్ దూర దృష్టితో అలోచించి సంబంధిత అధికారులతో ప్రతిపాదనలు చేయించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ప్రతిపాదించిన అంశాలకనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీచేసింది. డిఎల్‌ఆర్‌బి నిర్మాణంతోః నంద్యాల పట్టణంలోని శ్రీరామథియేటర్ వెనుక వైపు చామకాల్వపై 2.5 కి.మీ వద్ద డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జి (డిఎల్‌ఆర్‌బి) నిరా ్మణంతో ఎన్‌జివో కాలనీకి నేరుగా రాకపోకలు అనుసంధానం ఏర్పడుతుంది ప్రస్తుతం శ్రీనివాసనగర్, నూనెపల్లె ప్రధాన రహదారి నుంచి ఎన్జీవో కాలనీకి రెండు మార్గాల ద్వారా రాకపోకలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఎన్జీవో కాలనీకి వెళ్లె మార్గంలో రోజు రోజుకు పెరుగుతన్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని మంత్రి ఫరూక్ ప్రత్యేకంగా దృష్టిసారించి డిఎల్‌ఆర్‌బికి నిధులు మంజూరు చేయించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రత్యేక జిల్లా తోనే పశ్చిమ ప్రాంత.. అభివృద్ధి సాధ్యం..!

**:ర్యాలీకి భారీ గా తరలిన వెళ్లిన మండల వైసిపి నాయకులు..**

**పెద్దకడబూరు, జనవరి 24 ప్రభాతవార్త** ఆదోని జిల్లా సాధన సమితి ఆదోని ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదోని డివిజన్ బంద్ పిలుపునిచ్చారు మంత్రాలయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే భారీ ర్యాలీ నిరసన కార్యక్రమానికి పెద్దకడబూరు మండలం నుండి వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఆర్ పురుషోత్తం రెడ్డి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దకడబూరు మండలం నుండి ఆయా గ్రామాల నుండి వైసిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు ర్యాలీలో పాల్గొని నిరసన చేపట్టారు ఈ సందర్భంగా మండల వైసీపీ నేతలు పురుషోత్తం రెడ్డి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆదోని జిల్లా కు తమ పార్టీ కట్టుబడి ఉందని తమ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కూడా ఇప్పటికే జేఏసీ చేపట్టే అన్ని కార్యక్రమాల్లో పాల్గొని మద్దతు తెలిపారు అన్నారు ఆదోని జిల్లా అయితేనే పశ్చిమ ప్రాంతలైన మంత్రాలయం ఆదోని ఆలూరు ఎమ్మిగనూరు నియోజకవర్గల అభివృద్ధి చెందుతాయని , ఇక్కడ ప్రజలకు విద్య వైద్యం ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు ఆదోని ప్రాంత ప్రజలు దాదాపు 70



రోజులుగా ఆదోని జిల్లా చేయాలని కోరుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టించుకోక పోవడం దారుణం అన్నారు ఆదోని ని జిల్లా చేయకపోతే కూటమి ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజల బుద్ధి చెబుతారన్నారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వైసీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నంద్యాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మంత్రి ఫరూక్

**నంద్యాల, జనవరి 24, ప్రభాతవార్త ప్రతినిధిః** నంద్యాల నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని నంద్యాల పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని అంతర్గత రోడ్ల అనుసంధానంపై ప్రత్యేక దృష్టిసారించామని ఇందులో భాగంగానే ఎన్జీవో కాలనీకి అనుసంధానం కోసం ప్రస్తుతం రెండు మార్గాల్లో ఉన్న రద్దీని దృష్టిలో పెట్టుకొని మూడవ మార్గాన్ని అనుసంధానించేందుకు కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. శ్రీరామది :యోటర్ వెనుక చామకాల్వపై డి ఎల్ ఆర్ బి నిర్మిస్తే



వరదల సమయంలో రాకపోకల బంద్ సమస్య పరిష్కారం, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురురోడ్డు నుంచి కూడ ట్రాఫిక్ నియత్రించబడుతుంది. శ్రీనివాసనగర్, నూనెపల్లె ప్రధాన రహదారి నుంచి డిఎల్‌ఆర్‌బి మీదుగా నేరుగా ఎన్జీవో కాలనీకి వెళ్లి రావచ్చు. చామకాల్వ 2.5 కి. మీ. వద్ద డిఎల్‌ఆర్‌బి నిర్మాణానికి రూ.3 కోట్ల మొత్తాని ్న ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడం జరిగిందని తదుపరి చర్యలు చేపటి ్ట వీలైనంత త్వరగా నిర్మానం పూర్తిచేస్తాం. శాశ్వత ప్రాతిపదికన నంద్యాల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యచరణ ప్రణాళిక అమలు చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

-నిర్మాణ పనులు ప్రారంభిస్తాం- కెసి కెనాల్ ఇంజనీర్లుః చామకాల్వపై డిఎల్‌ఆర్‌బి నిర్మాణానికి ప్రభుత ్వం నిధులు మంజూరు చేయడంతో యుద్ధ ప్రాతిపదికన నిరా ్మణ పనులు ప్రారంభిస్తామని కెసి కెనాల్ డీఈ రవికుమార్, ఏఈ అబ్దుల్ మునాఫ్ వెల్లడించారు. ప్రతిపాదిన నిర్మాణ స ్థలాన్ని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండు మూడు రోజుల వ్యవధిలో నిర్మాణ పనులు చేపట్టేందుకు కార్యచరణ అమలు చేయబోతున్నట్లు డిఈ, ఏఈలు తెలిపారు.

# గంజాయి సేవిస్తున్న వ్యక్తులు అరెస్టు..!

**: 250 గ్రాముల గంజాయి స్వాధీనం .**
**: 2 బైక్‌లు సీజ్.**

**కర్నూలు జనవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి :** ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రాబడిన సమాచారం మేరకు కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నిన్నటి రోజున 87 బృందావన్ నగర్ , 88 నిర్మల్ నగర్ సచివాల యాలకు దగ్గర్లో ఒక పాడు బడిన గది లో గంజాయిని తీసుకుంటున్నారన్న సమాచారం తో రెవిన్యూ సిబ్బంది మరియు పోలీసు వారు కలిసి సదరు రూమ్ కి వెళ్లి చూడగా 7 మంది మగ వ్యక్తులు గంజాయి ని సేవిస్తూ ఉండగా, వారిని అదుపులోకి తీసుకొని, వారి నుండి 250 గ్రాముల గంజాయిని స్వాదీనం చేసుకొని, వాటిని సేవించడానికి ఉపయోగించిన బాటిల్ ను కూడా స్వాదినం చేసుకున్నారు. సదరు 7 మందిలో గంజాయి సరఫరా చేసిన కొత్తపేట కించెందిన 1) దుర్గా ప్రసాద్ ని, మరియు గంజాయి ని సేవిస్తున్న 6 గురు గురు రాఘవేంద్ర నగర్ కి చెందిన 2) తీ. కుమార్, ఎన్ ఆర్ పేట 3) గౌతమ్, బంగారుపేట 4) సత్య ప్రణవ్, జోహారాపురం 5) హర్షవర్ధన్, వి ఆర్ కాలనీ 6) సాయి కృష్ణ, గురు రాఘవేంద్ర నగర్ 7) సాయికుమార్ లను అరెస్ట్ చేసి ఈరోజున రిమాండ్ కి తరలించారు. ఈ సంధర్భంగా కర్నూలు నాల్గవ పట్టణ సిఐ విక్రమ సింహ్ మాట్లాడుతూ... గంజాయి ని దాచి ఉంచిన రెండు మోటార్ సైకిళ్ళు సీజ్ చేయడం తో పాటుగా, వీరికి



గంజాయి ఎక్కడి నుండి వచ్చిందన్న మూలాల పై కూడా విచారణ చేపడతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నాల్గవ పట్టణ సిఐ విక్రమ సింహ్ తో పాటు ఎస్సై గోపినాథ్, ఎఎస్సై రామ మునయ్య, క్రైమ్ పార్టీ పోలీసులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# పోటాపోటీగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుండి.. నీరువిడుదల



**పగిడ్యాల, జనవరి 24, ప్రభాతవార్త :** కెసికెనాల్‌లో పూర్తిగా నీరు అడగంటిపోయింది. దీంతో కెసికెనాల్ ఆయకట్టురైతులు పంటలు ఎండిపోతున్నాయనీ అందోళన చెందుతున్నా నేపథ్యంలో నీరువిడువల కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో శనివారం సాయత్రం నంద్యాల పార్లమెంటు టిడిపి ఇన్‌చార్జ్ శివానందరెడ్డి మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద పంపుహౌస్ వద్ద స్విచ్‌ఆన్ చేసి కెసి కెనాల్‌కు నీరువిడుల చేశారు. పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంపుహౌస్ వద్ద స్విచ్‌ఆన్‌చేసి బైరెడ్డి రాజశేఖరెడ్డి వర్గీయులు రాష్ట్ర సివిల్‌సప్లయ్ కార్పోరేషన్ డైరెక్టర్ తలముడిపి మహేష్‌నాయుడు, టిడిపి నాయకులు కాటం వెంకట్రామిరెడ్డి అనుచరవర్గం కెసి కెనాల్‌కు నీరు విడుదల చేశారు. మల్యాల ఎత్తిపోతల పథకం పంపుహౌస్ వద్ద స్విచ్ అన్‌చేసి కెసికి నీరువిడుదల చేసిన అనంతరం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంపంపుహౌస్ వద్దకు మాండ్ర శివానందరెడ్డి వచ్చేలోపు రాష్ట్ర సివిల్‌సప్లయ్ కార్పోరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, టిడిపి నాయకులు కాటం వెంకట్రామిరెడ్డి ముచ్చుమర్రి పంపు హౌస్‌వద్ద స్విచ్‌అన్ చేసి నీరువిడుదల చేశారు. మాండ్ర



శివానందరెడ్డి వర్సెస్ బైరెడ్డి రాజశేఖరెడ్డి వర్గీయులు పోటాపోటీగా కెసి కెనాల్‌కు ఎత్తిపోతల పథకం నుండి నీరువిడదల చేయడం చర్చనీయాంశంగా మారింది, మల్యాల ఎత్తిపోతల పథకం నుండి, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుండి దాదాపు 1670 క్యూ నీరు విడుదల చేయడంతో కెసికెనాల్ ఆయకట్టు రైతులుసంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# నందవరంలో.. రెండు ఇళ్లల్లో ఛోరీ

**నందవరం, జనవరి 24, ప్రభాతవార్తః** మండల కేంద్రమైన నందవరంలో సుమారు 11 గంటల సమయంలో పూలచింత రోడ్డు సమీపంలో ఉప్పర పంపయ్య కుమారులు ఉప్పర రాము, ఉప్పర రాజులు ఉన్న రెండు ఇళ్ళల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు తమ కుమారులు రోజువారి నిమిత్తం పొలం పనులకు వెళ్లారన్నారు. కొద్దిసేపటికే అటువైపు నుండి పెద్ద కుమారుడైన మల్లన్న తమ ఎద్దులకు నీరు తాపడానికి అటువెళ్లి చూడగా ఇద్దరు తమ్ముళ్ల ఇళ్ళకు తాళాలు తీసిఉన్నాయని గమనించి తండ్రికి సమాచారం అందించాడు. వెంటనే అక్కడున్నటువంటి ఇరుగుపొరుగు వారిని పిలిచి పోలీసులకు సమాచారం అందించామన్నారు. వెంటనే నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పరిశీలించి ఎగ్మనూరు రూరల్ సిఐ చిరంజీకి సమాచారం తెలిపారు. సమాచారం అందుకున్న సిఐ వెంటనే అక్కడికి చేరుకొని పరిశీలించి కర్నూలు నుండి క్లూస్ టీమ్ ద్వారా పరిశీలించి అక్కడున్న చేతి వేలిముద్రలను వివిధ అధారాలను సేకరించారు. ఛోరీ జరిగిన ఇళ్ళల్లో సుమారు ఉప్పర రాము ఇంట్లో 15 గ్రాముల బంగారు, 15 తులాల వెండి, రూ.83 వేలు నగదు, ఉప్పర రాజు ఇంట్లో 30 గ్రాముల బంగారు. తులం వెండి, రూ.80 వేలు ఉన్నట్లు పోలీసులకు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిని అన్నివిధాల పరిశీలించి ఛోరీకి పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# అవగాహన కార్యక్రమం



**ఆదోని క్రైమ్ జనవరి 23, ప్రభాతవార్త :** ఆదోని 3టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూనిమహల్లా ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీసులు ఈ కార్యక్రమంలో ఆదోని డిఎస్పి హేమలత ఆధ్వర్యంలో త్రీటౌన్ సిఐ రామలింగమయ్యశక్తి మాట్లాడుతూ శక్తి యాప్ గురించి మరియు దాని ప్రత్యేకల గురించి. మరియు బాలవివాహాలు, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, పోక్సో యాక్ట్, హనీ ట్రాప్, మహిళల వేధింపులు, వరకట్న వేధింపులు, భ్రూన హత్యలు, శ్రీఆత్మహత్యలు, ప్రేమ పేరుతో వంచన, సోషల్ మీడియా ప్రభావం, మొదలగు విషయాల గురించి స్థానిక మహిళలకు ప్రజలకు తెలిపారు

# బాలికలకు విద్య, భద్రత అందించాలి

**: డీఎల్ఎస్ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి**



**కర్నూలు లీగల్ , జనవరి 24, ప్రభాతవార్త,:** బాలికలకు విద్య, భద్రత కల్పించడం మనందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి అన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ వారి ఆదేశాల మేరకు శనివారం కర్నూలు బి క్యాంపులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అథితితాగా ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బాలికకు నాణ్యమైన విద్యతో పాటు సామాజిక భద్రతను అందించాల్సిన బాధ్యత మన అందరిదీ అని, బాలికలపై వివక్ష, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థలను నిర్మూలించాల్సిన అవసరం మన అందరి పైన ఉందన్నారు. బాల్య వివాహాలు జరుగుతుంటే ఆ సమాచారాన్ని చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు గాని లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 కు కానీ కాల్ చేస్తే వారు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి వివాహాన్ని నిలుపు దల చేస్తారని తెలిపారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ నోడల్ ఆఫీసర్ రఘు గారు మాట్లాడుతూ హాస్పిటల్స్ నందు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరమని అన్నారు. మహిళా ఎస్ ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణ కల్పించడానికి అనేక చట్టాలు ఉన్నాయని అన్నారు. బాలికల సంక్షేమానికి బేటి బచావో బేటి పడావో లాంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని, వారి ఆరోగ్య పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ఈమేరకు డిసిపిఓ శారద బాల్యవివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిస్టిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీస్ నోడల్ ఆఫీసర్ రఘు మరియు పి.సి పి.యన్. డి. టి. ప్రోగ్రాం ఆఫీసర్ సుమలత, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ముని చంద్ర, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రమణయ్య, డిసిపిఓ శారద, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ప్రతిగ్రామం స్వచ్ఛ గ్రామంగా మారాలి

**- మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి**

**నంద్యాల, జనవరి 24, ప్రభాతవార్త ప్రతినిధిః** ప్రతి గ్రామం స్వచ్ఛగ్రామంగా మారాలని ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కానాలలో స్వచ్ఛ రథం (చెత్తసేకరణ వాహనం)ను జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి ప్రారంభించారు. ఈసందర ్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా ఈస్వచ్ఛ రథాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ప్రజల ఆరోగ్యం స్వచ్ఛమైన వాతావరణం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పరిశుభ్రత పరిరక్షణలో ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఇళ ్ళల్లో తడిచెత్త, పొడి చెత్త వేరు వేరుగా వర్గీకరించి ఇవ్వాలని సూచించారు. అలాగే ఆట్లపెట్టెలు, ప్లాస్టిక్ సీసాలు, ఇనుము తదితర పనికిరాని వస్తువులను స్వచ్ఛరథం వచి ్చప్పుడు అప్పగిస్తే వాటికి కొంత తగిన మేర నగదు లేదా గృహవినియోగానికి ఉపయోగపడే వస్తువులు అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ జి రాజకమారి మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వం బాద్యత మాత్రమే కాకుండా ప్రజలందరి సమూహిక బాధ్యతన్నారు. గ్రామంలో చెత్త నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసి, స్వచ్ఛతను నిరంతరం కొనసాగించేందుకు స్వచ్ఛ రథాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, పిట్టల హానిఫ్, లాయర్ బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మార్వో, ఎంపీడివో మండల అధికారులు పాల్గొన్నారు.

